RNI Reg-No. APTEL/2002/07373

Postal Registration No.VJ/215/2025-27

# నేటి మనదేశమ్

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Vijayawada, Visakhapatnam, Tirupati & Hyderabad

సంపుటి :24 Vol. No.24 సంచిక : 97 Issue No. 97 విజయవాడ Vijayawada సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: సోమవారం 06-04-2026 Monday, April 06 2026 పేజీలు : 8 Pages: 8 వెల: రూ.1-00 Price Rs.1-00


## పెన్నానదిలో స్నానానికి దిగి ఒకరి మృతి.. ఇద్దరి గల్లంతు



**కడప, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వైఎస్సార్ కడప జిల్లా వల్లూరు మండలం పుష్పగిరి వద్ద పెన్నా నదిలో స్నానానికి దిగి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. దీంతో పోలీసులు వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టగా.. ఒకరి మృతదేహం లభ్యమైంది. మరో ఇద్దరి ఆచూకీ కోసం వెతుకుతున్నారు. ముగ్గురు యువకులను కడపకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.

## మమతా బెనర్జీకి కౌంట్‌డౌన్ మొదలైంది

### మెగా ర్యాలీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



**కూచ్‌బిహార్, ఏప్రిల్ 5:** పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మరింత వెడెక్కింది. కూచ్‌బిహార్‌లో ఆదివారంనాడు జరిగిన మెగా ర్యాలీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. పశ్చిమబెంగాల్‌లోని మాల్దా, సందేశ్‌కాళి ఘటనలపై ప్రధాని విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో 'మహా ఆటవిక రాజ్యం' నడుస్తోందని, ఈ ఘటనలను టీఎంసీ బాధ్యత వహించాలని అన్నారు. బెంగాల్‌లో మమతా బెనర్జీకి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్నప్పటికీ పశ్చిమబెంగాల్‌లో పరిస్థితి చాలా దారుణంగా తయారైందని ప్రధాని విమర్శించారు. బెంగాల్ ప్రజలను టీఎంసీ లూటీ చేసిందని, మే 4న ఫలితాలు వచ్చిన తర్వాత టీఎంసీ ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని అన్నారు.కేంద్రంలోని బీజేపీ ఇంతవరకూ 3 లక్షల మంది సోదరీమణులను కరోడ్‌పతి దీదీలను చేసిందని, దేశం కోసం మిగతా 2లో..




## నీటి సంరక్షణకు వంద రోజుల యాక్షన్ ప్లాన్

### తాడిపత్రి నియోజకవర్గం యాడికిలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

**అమరావతి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నీటి సంరక్షణ – జలవనరుల పరిరక్షణ అంశాలే అజెండాగా 100 రోజుల కార్యాచరణను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. 'నీటి భద్రత– సాగునీటి సంఘాల బాధ్యత' పేరుతో ఏప్రిల్ 6 నుంచి జులై 14వ తేదీ వరకు ప్రభుత్వం మిగతా 2లో..

## అమరావతిపై కడుపు మంటతోనే జగన్ కొత్త నాటకం

### స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



**అమరావతి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అమరావతితో పాటు సీఆర్‌డీఏ పరిధి మొత్తం అభివృద్ధి జరుగుతుందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. జగన్ 3 ముక్కలాట నాటకం అయిపోయిందని.. మావిగన్ మొదలైందని ఎద్దేవా చేశారు. స్పష్టంగా జీవో ఇచ్చినా.. సరిగా చూడకుండా మాట్లాడతారా? అని ప్రశ్నించారు. సీఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేసే ప్రయత్నం చేశారా.. లేదా? అని నిలదీశారు. వైకాపా హయాంలో ఏపీసీఆర్‌డీఏ అక్కర్లేదని జగన్ బిల్లు ఎందుకు పెట్టారన్నారు. "జగన్ ఎన్ని నాటకాలాడినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరు. అమరావతిపై ఉన్న కడుపు మిగతా 2లో..

## అమెరికా సైన్యం కదలికలపై చైనా 'ఏఐ' నిఘా



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 5:** పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధంలో మధ్య జరుగుతున్న యుద్ధంలో చైనా ఇరాన్‌కు రహస్యంగా సాయం చేస్తున్నట్లు పలు నివేదికలు వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. అమెరికా సైనిక మోహరింపులు, ఆయుధ నిల్వలు, యుద్ధ విమానాలు, విమానవాహక నౌకల కదలికలు, సైనిక స్థావరాలు వంటి వాటిని నిరంతరం పర్యవేక్షించడానికి చైనా టెక్ కంపెనీలు ఏఐటెక్నాలజీ, ఓపెన్ సోర్స్ డేటాను వాడుతున్నాయట. పైపు యుద్ధం ముగించాలని చైనా బహిరంగంగా ఇరువర్గాలకు సూచిస్తున్నప్పటికీ.. మరోవైపు రహస్యంగా ఇరాన్‌కు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం తమ ప్రైవేట్ కంపెనీల సాయం తీసుకుంటున్నాయి. బహిరంగంగా అందుబాటులో ఉన్న ఉపగ్రహ చిత్రాలు, ఫ్లైట్ ట్రాకర్లు, నౌకా రవాణా సమాచారం, కృత్రిమ మేధను వినియోగించుకొని అమెరికా సైన్యాన్ని ట్రాక్ చేస్తున్నాయని కొన్ని సంస్థలు తెలిపాయి. ఈ సమాచారం అంతటినీ చైనా కంపెనీలు ఆ దేశ సైనిక ఉన్నతాధికారులకు చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికా దళాల మోహరింపును బహిర్గతం చేసేలా నిఘా టూల్స్‌ను బహిరంగంగా మార్కెటింగ్ చేస్తున్నట్లు తెలిసింది. ఈ నిఘా టూల్స్‌ను ఉపయోగించి ఎవరైనా ఎక్కడి నుంచైనా విమానాల కమ్యూనికేషన్‌లను విశ్లేషించవచ్చని, భారీ సైనిక కదలికలను పర్యవేక్షించవచ్చని నిఘానిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ముప్పును ఎలా ఎదుర్కోవాలనే విషయంపై అమెరికా అధికారులు, నిపుణులు పరిశోధిస్తున్నట్లు సమాచారం. చైనా ప్రైవేట్ రంగ జియోస్పేషియల్ విశ్లేషణ సామర్థ్యాన్ని మరింత పెంచుకోవడం వల్ల అమెరికాకే కాకుండా ప్రపంచ దేశాలకు కూడా ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ ఒకప్పుడు కొంతమంది నిపుణులకే పరిమితమైందన్నారు. కానీ, ప్రస్తుతం ఏఐ రాకతో ఒకప్పుడు ప్రభుత్వాలకు మాత్రమే లభించే అంతర్గత సమాచారం ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులకు కూడా అందుబాటులోకి వస్తోందన్నారు.

## రాజధానికి భూములిచ్చిన రైతులను అవమానిస్తారా?

### మంత్రి పార్థసారథి



**అమరావతి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజధానిపై ఏం మాట్లాడుతున్నారో వైకాపా అధినేత జగన్‌కు కనీసం అర్థమవుతుందా? అని మంత్రి కొలుసు పార్థసారథి ప్రశ్నించారు. సీఎం చంద్రబాబుపై ప్రజలకు అపార నమ్మకం ఉందన్నారు. ఆ నమ్మకంతోనే రైతులు రాజధానికి స్వచ్ఛందంగా భూమిలిచ్చారని పేర్కొన్నారు. "రాజధానికి భూములిచ్చిన రైతులను అవమానిస్తారా..?. రాబోయే రోజుల్లో వైకాపాకు ప్రజలు పుట్టగతులు లేకుండా చేస్తారు. రాష్ట్ర బడ్జెట్ మొత్తాన్ని అమరావతికి ఖర్చు పెడుతున్నారని దుష్ప్రచారం చేస్తున్నారు" అని మంత్రి మండిపడ్డారు.

## రాజధానిపై వైకాపాకు స్పష్టత లేదు.. మావిగన్ అంటే నవ్వుతున్నారు

### నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి




**హైదరాబాద్, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. "కృష్ణాపురం వద్ద తమిళనాడు మత్స్యకారులు 4 బోట్లు తీసుకెళ్లారు. మన మత్స్య సంపద తీసుకుపోతున్నారని జాలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు రెండు బోట్లు ఇప్పించారు. మరో మిగతా 2లో..

## క్షమాపణలు చెప్పినా.. ఆయన్ను వదిలిపెట్టం

### అస్సాంలోని బిశ్వనాథ్ చరియాలీలో నిర్వహించిన ప్రచార సభలో రాహుల్

**బిశ్వనాథ్ చరియాలీ, ఏప్రిల్ 5:** అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ క్షమాపణలు కోరినా.. ఆయన్ను వదిలిపెట్టబోమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అస్సాంలోని బిశ్వనాథ్ చరియాలీలో నిర్వహించిన ప్రచార సభలో రాహుల్ పాల్గొని ప్రసంగించారు. హిమంతను దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన ముఖ్యమంత్రిగా అభివర్ణించారు. "అస్సాంకు చెందిన దివంగత గాయకుడు జుబిన్ గర్గ్.. రాష్ట్ర ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు తన జీవితాంతం కృషి చేశారు. ఆయన ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించలేదు. మా పార్టీ భావజాలం కూడా అలాంటిదే. ద్వేషానికి వ్యతిరేకంగా ప్రేమను పంచడమే మా సిద్ధాంతం.

మేం అధికారంలోకి వస్తే.. జుబిన్ మృతి కేసులో నిందితులను 100 రోజుల్లోగా శిక్షిస్తాం" అని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ఆరు సామాజిక వర్గాలకు ఎస్టీ హోదా ఇస్తామని, తేయాకు కూలీలకు రోజుకు రూ.450 చెల్లించేలా



చర్యలు తీసుకుంటామని తెలిపారు. హిమంత నేతృత్వంలోని భాజపా సర్కారు ప్రజల్లో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. హిమంత అవినీతి చిట్టా ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా వద్ద ఉందన్నారు. ఇక్కడి ప్రభుత్వాన్ని దిల్లీ నుంచి నియంత్రిస్తున్నారని, రాష్ట్రాన్ని భాజపా ఏటీఎంలా మార్చేశారని విమర్శించారు. మరికొన్ని రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవుతుందని, అప్పుడు హిమంత క్షమాపణలు కోరినా.. ఆయనపై చర్యలు తప్పవని చెప్పారు.

## సినిమా ఇంకా ఉంది మిత్రమా

### ఆమ్‌ఆద్మీకి రాఘవ్ చడ్డా కౌంటర్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 5:** రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చడ్డా ను ఆ పార్టీ తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. పంజాబ్ సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తకుండా మౌనం వహిస్తున్నారని పార్టీ ఆరోపిస్తోంది. అయితే, ఆప్ విమర్శలను రాఘవ్ మరోసారి తోసిపుచ్చారు. పంజాబ్ కేవలం తనకు రాజకీయ అంశం కాదన్నారు. ఓ వీడియోను ఎక్స్ వేదికగా విడుదల చేసి 'సినిమా ఇంకా మిగిలే ఉంది మిత్రమా!' అంటూ గట్టి కౌంటర్ ఇచ్చారు. పంజాబ్‌తో బలమైన సంబంధం ఉందని ఉద్ఘాటించారు. రైతుల కోసం ఎంఎస్‌పీకి చట్టబద్ధత, నన్‌కనా సాహిబ్ కారిడార్, రాష్ట్ర భూగర్భ జలాల తగ్గుదల, భగత్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలనే డిమాండ్లపై పార్లమెంటులో గళం విప్పానని గుర్తుచేశారు. ఆప్ తనను టార్గెట్ చేసిందని ఆరోపించారు. "పంజాబ్ సమస్యలను లేవనెత్తడంలో విఫలమయ్యానంటూ పార్టీలోని నా మిత్రులు వీడియోలను రిలీజ్ చేశారు. పంజాబ్ కేవలం నాకు రాజకీయం అంశం కాదు. నా ఆత్మ, నా ఇల్లు, నా భూమి, నా విధి" అని అన్నారు. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను రిలీజ్ చేస్తూ ఇది చిన్న ట్రైలర్ మాత్రమే.. సినిమా ఇంకా ఉంది మిత్రమా! అంటూ గట్టి కౌంటర్ ఇచ్చారు.

మొదటి పేజీ తరువాయిలు

## మమతా బెనర్జీకి కౌంట్‌డౌన్ మొదలైంది

తీసుకుంటున్న నిర్ణయాల్లో మహిళలకు ప్రాధాన్యం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఇందుకోసం తమ ప్రభుత్వం మహిళలకు లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో 33 శాతం రిజర్వేషన్ కల్పించే చట్టం తెచ్చిందని చెప్పారు. ఇందువల్ల 2020 లోక్‌సభ ఎన్నికల నుంచి పశ్చిమబెంగాల్‌తో సహా దేశవ్యాప్తంగా మహిళలకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. ఏప్రిల్ 16,17,18 తేదీల్లో పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరుపుతున్నామని చెప్పారు. మన తల్లులు, సోదరీమణులకు 40 ఏళ్లుగా చట్టసభల్లో రిజర్వేషన్ హక్కు లేకుండా పోయిందని, ఇంకా జాప్యం జరగడం సరికాదని అన్నారు. జనాభా నియంత్రణను సమర్ధవంతంగా అమలు చేసిన రాష్ట్రాలకు ఇందువల్ల ఎలాంటి నష్టం జరగదని, అన్ని రాష్ట్రాలు, అందరి హక్కుల పరిరక్షణ జరుగుతుందని భరోసా ఇచ్చారు. పోలింగ్ రోజున టీఎంసీ గూండాలకు భయపడవద్దని, చట్టాన్ని నమ్మండని మోదీ కోరారు. మే 4న టీఎంసీ పాలన ముగియగానే ఆ పార్టీ గూండాలు, సిండికేట్లపై చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. చొరబాటుదారులను కాపాడేందుకే ఎస్ఐఆర్ ప్రక్రియను టీఎంసీ వ్యతిరేకిస్తోందని, రాబోయే ఎన్నికలు టీఎంసీ భవిష్యత్తును నిర్ణయించనున్నాయని, ప్రజలు బీజేపీకి ఓటు వేయాలని కోరారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను ఎన్నికల కమిషన్ స్వేచ్ఛగా, సజావుగా నిర్వహిస్తుందనే నమ్మకం తనకు ఉందని అన్నారు. కాగా, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతలుగా జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## అమరావతిపై కడుపు మంటతోనే జగన్ కొత్త నాటకం

మంటతోనే కొత్త నాటకం ఆడుతున్నారు. కొత్త పేర్లు తీసుకొచ్చిన జగన్‌ను చూసి.. ప్రజలు నవ్వుకుంటున్నారు. సీఆర్‌డీఏ మ్యాప్ చూస్తే చంద్రబాబు విజన్ ఏంటో అర్థమవుతుంది” అని పట్టాభి అన్నారు.

**అవినీతి, దోపిడీ జగన్‌కు రెండు కళ్లు: ప్రత్తిపాటి**

అవినీతి, దోపిడీ జగన్‌కు రెండు కళ్లు అని తెదేపా నేత ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా జగన్ ముఠా తీరు మారలేదని విమర్శించారు. రాజధానిపై జగన్ చిమ్మే ప్రతి విషపు బొట్టు.. ఆయన పతనానికే అన్నారు. అమరావతిని బలపరిస్తేనే ప్రజల్లో ఉంటారని వైకాపా గ్రహించాలన్నారు.

## రాజధానిపై వైకాపాకు స్పష్టత లేదు.. మావిగన్ అంటే నవ్వుతున్నారు

రెండింటిని తమిళనాడు నుంచి తెప్పించారు. త్వరలో తిరుపతికి ఒకటి, నెల్లూరుకు రెండు, బాపట్లకు ఒక బోటు ఇవ్వనున్నాం. ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు వేటపై నిషేధం ఉంది” అని ఎంపీ ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

**తెదేపాలోనే కొనసాగుతాం..**

అయోధ్యరామిరెడ్డిని కలిసి తాము చర్చించామన్న వార్తలు అవాస్తవమని.. తాము కూటమి ప్రభుత్వంలో చాలా గౌరవంగా ఉన్నామని ఎంపీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తెదేపాలోనే కొనసాగుతామని స్పష్టం చేశారు. రాజధాని అంటే వైకాపాకు స్పష్టత లేదని.. మావిగన్ అంటే నవ్వుతున్నారని ఎద్దేవా చేశారు. మత్స్యకారులకు జగన్ పార్టీ మొదట్నుంచీ ద్రోహం చేస్తూ వచ్చిందని విమర్శించారు.

## బిఆర్ నాయుడికి వ్యతిరేకంగా వైసిపి నిరసనలు

**ఆలయాల్లో ప్రత్యేక పూజల నిర్వహణ**

**అమరావతి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ.. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నిరసనలు చేపట్టింది. వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నేతలు.. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలోనూ నిరసనలు చేపట్టారు. బీఆర్ నాయుడు రాసలీలలు వెలుగులోకి వచ్చినా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోకపోవటంపై వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికీ బీఆర్ నాయుడిని వెనకేసుకువస్తున్న చంద్రబాబు తీరుపై మండిపడ్డారు. ప్రపంచవ్యాప్త హిందూ భక్తులు, నెటిజన్ల విమర్శలను కూడా చంద్రబాబు పట్టించుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ మండిపడుతోంది. పులివెందులలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పట్టణంలోని వెంకటేశ్వర ఆలయంలో 101 టెంకాయలు కొట్టి వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ నాయుడు అనైతిక కార్యకలాపాలు, ఆయన వ్యవహార శైలితో టీటీడీ పవిత్రతను దెబ్బతీస్తున్నాడని ఆయనకు మంచి బుద్ధి ప్రసాదించాలని వైఎస్సార్‌సీపీ నేతలు ప్రత్యేక పూజలు చేశారు.బీఆర్ నాయుడు టీటీడీ చైర్మన్ పదవి నుంచి వెంటనే తొలగించి టీటీడీ పవిత్రతను కాపాడాలని వైఎస్సార్‌సీపీ నాయకుల డిమాండ్ చేశారు. ఈ నిరసన మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నాయి. అనంతపురంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు ఆందోళన నిర్వహించారు. అనంతపురం నగరంలోని శ్రీకంఠం సర్కిల్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్లకార్డులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎందుకు మౌనంగా ఉంటున్నారంటూ మండిపడ్డారు. విశాఖ తూర్పు నియోజకవర్గంలోని వెంటేశ్వరస్వామి వారి ఆలయంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రత్యేక పూజలు పూజలు నిర్వహించాయి. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు రమణకుమారి, మాజీ మేయర్ హరి వెంకట కుమారి తదితరులు పాల్గొన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మాచవరం దాసాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. బీఆర్ నాయుడిని టీటీడీ చైర్మన్ పదవి నుండి తొలగించాలని వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేశారు. పూజల్లో మాజీ ఎమ్మెల్యే, మల్లాది విష్ణు, వైఎస్సార్‌సీపీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు. బీఆర్ నాయుడిని టీడీడీ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు ప్లకార్డులు ప్రదర్శించారు. టీటీడీ పవిత్రతను కాపాడాలంటూ నినాదాలు చేశారు.

# నీటి సంరక్షణకు వంద రోజుల యాక్షన్ ప్లాన్

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమం చేపట్టనుంది. సోమవారం తాడిపత్రి నియోజకవర్గం యాడికిలో జరిగే కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో యాక్షన్ ప్లాన్‌పై రాష్ట్రంలోని సాగునీటి సంఘాల సభ్యులతో చంద్రబాబు ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. నీటి పారుదల, అటవీ, పంచాయతీరాజ్, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల సమన్వయంతో ‘నీటి భద్రత–సాగునీటి సంఘాల బాధ్యత’ కార్యక్రమం చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఏప్రిల్ 6 నుంచి ఏప్రిల్ 15 తేదీ వరకు పనుల గుర్తింపు కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ 16 నుంచి 20వ తేదీ వరకు గుర్తించిన పనులకు పరిపాలనా అనుమతులు ఇవ్వాలని, ఏప్రిల్ 21 నుంచి జులై 9వ తేదీ వరకు పనులను చేపట్టాలని ఆదేశించారు. జులై 10 నుంచి 14 వరకు.. పూర్తి చేసిన పనులకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని సూచించారు. సాగునీటి సంఘాలే కేంద్రీకృతంగా ఈ కార్యక్రమాలు అమలు చేసేలా ప్రణాళికలు రూపొందించారు. రాష్ట్రంలోని 60 వేల మంది సాగునీటి సంఘాల సభ్యులకు కీలక బాధ్యతలు అప్పగించారు. వేసవికి ముందు 6 మీటర్లు, వర్షాకాలం తర్వాత 3 మీటర్ల లోతులో భూగర్భ జలాలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఫీడర్ ఛానెళ్లను క్లియర్ చేయడం సహా.. పూడికతీత పనులు చేపట్టాలన్నారు. గుర్రపు డెక్క తొలగించాలని.. చెరువులు, కాల్వలను క్లియర్ చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అవసరమైన మేరకు చెక్ డ్యామ్‌లను రిపేర్లు చేయాలని.. కొత్త స్ట్రక్చర్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. సాగునీటి సంఘాలు వాటర్ బడ్జెట్ తయారు చేసుకోవాలని సూచించారు. ప్రజాచైతన్యం, ప్రజల భాగస్వామ్యంతో 100 రోజుల ఉద్యమాన్ని సమర్ధంగా ముందుకు తీసుకెళ్లాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## హర్మూజ్‌ను దాటిన ‘గ్రీన్ ఆశా’



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 5:** గల్ఫ్ నుంచి భారీ ఎల్పీజీ లోడ్‌తో భారత్‌కు బయల్దేరిన మరో నౌక ‘గ్రీన్ ఆశా’ హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. మరికొన్ని రోజుల్లో ఇక్కడికి చేరుకోనుంది. హర్మూజ్ ను సురక్షితంగా దాటి వచ్చిన తొమ్మిదో భారత నౌక ఇది. జలసంధి నుంచి ఇప్పటివరకు భారత జెండాతో ఎనిమిది నౌకలు సురక్షితంగా హర్మూజ్ దాటి వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో రెండు ఎల్పీజీ నౌకలు గత రెండు రోజుల్లో హర్మూజ్‌ను దాటాయని అధికారులు పేర్కొన్నారు. ఇవి రెండు కలిపి 94 వేల టన్నుల ఎల్పీజీని తీసుకొస్తున్నాయని, ఈ నెల 31న ఓ నౌక ముంబయికి, ఏప్రిల్ 1న మరొకటి న్యూ మంగళూరుకు చేరుకునే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతానికి భారత జెండా కలిగిన నౌకలను స్వదేశానికి తీసుకురావడానికే ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.

## భౌగోళిక సవాళ్లను అధిగమించేశాం

**విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ వ్యాఖ్య**



**రాయ్‌పుర్ ఏప్రిల్ 5:** ‘ఇటీవలి అంతర్జాతీయ కుదుపులు భారత సామర్థ్యానికి పరీక్షగా నిలిచాయి, దేశం వాటిని విజయవంతంగా అధిగమించింది’ అని విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ శనివారం వ్యాఖ్యానించారు. రాయ్‌పుర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ 15వ స్నాతకోత్సవ సభలో ప్రసంగిస్తూ ఆయన ఈ మాటలన్నారు. దేశీయంగా, అంతర్జాతీయంగా తలెత్తిన సవాళ్లను భారత్ విజయవంతంగా ఎదుర్కొందని జైశంకర్ అన్నారు. పశ్చిమాసియా సంక్షోభ నేపథ్యంలో తలెత్తిన ఇంధన సమస్యను భారత్ అధిగమించిందని ఆయన పరోక్షంగా పేర్కొన్నారు. “ఇప్పుడు మన ఆర్థికవ్యవస్థ ప్రపంచంలో ఐదో స్థానంలో నిలిచింది. ఇటీవలి భౌగోళిక కుదుపుల నుంచి విజయవంతంగా బయటపడ్డాం” అని ఆయన అన్నారు.

# ఉద్యోగినిపై అత్యాచారం ఘటన

**తోణ చర్యలకు ఆదేశించిన మహిళా కమిషన్**

**అమరావతి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పల్నాడు జిల్లా మాచర్లలో ప్రభుత్వ ఉద్యోగినిపై అత్యాచారం ఘటన తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ అమానుష ఘటనపై ఏపీ మహిళా కమిషన్ సీరియస్ అయ్యింది. నిందితుడిని తక్షణమే అరెస్టు చేయాలని, బాధిత మహిళను ఆదుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బాధితురాలిని కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఫోన్‌లో పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా కమిషన్, ఏపీ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నిందితుడిని తక్షణమే అరెస్టు చేయాలని పోలీసు అధికారులను మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఆదేశించారు. ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహిళల భద్రతపై రాజీ పడే ప్రసక్తే లేదని కామాంధులకు హెచ్చరికలు జారీ చేశారు. ఆడవారి జోలికొస్తే ఎంతటి వారైనా ఉపేక్షించమని స్పష్టం చేశారు. మహిళల రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చైర్‌పర్సన్ వ్యాఖ్యానించారు. బాధితురాలికి అన్ని విధాలా సహాయం అందించాలని సూచించారు. ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో బాధిత మహిళ చికిత్స పొందుతున్నారు. కాగా, ఏప్రిల్ 2న సాయంత్రం 4గంటల ప్రాంతంలో పల్నాడు జిల్లా మాచర్లలో నివాసం ఉంటున్న ఓ ప్రభుత్వ ఉద్యోగిని ఇంటికి వెళ్లాడు నిందితుడు. మంచి నీళ్ల నెపంతో తలుపు తప్పి అనంతరం బలవంతంగా ఇంట్లోకి ప్రవేశించాడు. సదరు మహిళ నోట్లో బట్టలు కుక్కి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమెను కత్తితో గాయపరిచి మర్మాంగాలపైనా రాడ్డుతో దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావంతో బాధితురాలు ఆస్పత్రిలో చేరింది. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది.


# రెండు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

**గుంటూరు, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ఎంతోమంది అమాయకుల ప్రాణాలు పోతున్నాయి. ఏపీలో రెండు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మరణించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. పట్టణంలోని తాలూకా సెంటర్ వద్ద బైక్ అదుపు తప్పి లారీ కిందపడటంతో వృద్ధ దంపతులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిరంగిపురం మండలం వేమవరం గ్రామానికి చెందిన అంజయ్య(63), కోటేశ్వరమ్మ(60) దంపతులు ఒక శుభకార్యానికి హాజరయ్యేందుకు బైక్ పై పిడుగురాళ్ల వైపు బయలుదేరారు. సత్తెనపల్లిలోని తాలూకా సెంటర్ వద్దకు చేరుకోగానే బైక్ ఒక్కసారిగా అదుపు తప్పింది. ఆ సమయంలో పక్కనే వెళు‌తున్న లారీ కిందకు బైక్ దూసుకుపోవడంతో, లారీ చక్రాలు వారిపై నుంచి వెళ్లాయి. తీవ్ర గాయాల పాలైన అంజయ్య, కోటేశ్వరమ్మలు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పర్చూరు తహశీల్దార్ బ్రహ్మయ్య ప్రయాణిస్తున్న కారు మోపెడ్‌ను ఢీకొట్టిన ఘటనలో.. ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. పసుమర్తి గ్రామ సమీపంలోని నూతన నేషనల్ హైవేపై ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వనపర్తి గ్రామానికి చెందిన సుధాకర్ స్థానిక కోల్డ్ స్టోరేజ్‌లో పనిచేస్తున్నాడు. శనివారం పని ముగించుకుని తన బైక్‌పై ఇంటికి తిరిగి వెళు‌తుండగా, పసుమర్తి హైవే వద్ద వెనుక నుంచి అతివేగంగా వచ్చిన తహశీల్దార్ కారు సుధాకర్ వాహనాన్ని ఢీ కొట్టింది. సుధాకర్ టూవీలర్‌ను కారు సుమారు 300 అడుగుల మేర ఈడ్చుకుపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందారు. చిలకలూరిపేట పోలీసులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రమాదానికి గల పూర్తి కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# ఎఐ వైపు ఐటిరంగం పరుగు

**మార్పులకు అనుగుణంగా మారాలి... సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉండాలి... ఎఐ సమ్మిట్‌లో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**




**అమరావతి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వైపు ఐటీ రంగం వేగంగా మారుతోందని ఆంధ్రప్రదేశ్ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. దీనికి అనుగుణంగా మన మానవ వనరులకు తగిన శిక్షణ ఇవ్వడం చాలా అవసరమని మంత్రి అభిప్రాయపడ్డారు. అమరావతి రీజియన్‌లో ఏఐ సమ్మిట్‌ను మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. కృత్రిమ మేధపై అవగాహన పెంచేందుకు, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఏపీ ప్రభుత్వం, ఎస్‌టీపీఐ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కెరీర్ పట్ల స్పష్టత, టెక్నాలజీకి అనుగుణంగా స్కిల్స్ పెంచుకోవడంపై దిశానిర్దేశం చేశారు. 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో వస్తున్న మార్పులు, భవిష్యత్ తరాలకు అందించాల్సిన శిక్షణపై వర్క్‌షాప్ నిర్వహించారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు అమరావతి, విజయవాడలో ఈ నాలుగో సదస్సును నిర్వహిస్తున్నాం. గతంలో విశాఖపట్నంలో రెండు సార్లు, కాకినాడలో ఒకసారి ఈ కార్యక్రమాలు జరిగాయి. 25 ఏళ్ల కిందట సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాల వల్ల ఐటీ రంగంలో తెలుగువారు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. హైదరాబాద్ ఒక మహానగరంగా అభివృద్ధి చెందింది. విశాఖపట్నంలో డేటా సెంటర్లు ఏర్పాటు కాబోతున్నాయి. ఇప్పటికే మూడు గిగావాట్ల డేటా సెంటర్స్ కోసం ఒప్పందాలు జరిగాయి. మరో 3 గిగావాట్లు పైప్‌లైన్‌లో ఉన్నాయి. క్వాంటమ్ కంప్యూటింగ్ ఇనిషియేటివ్‌ను అమరావతిలో ప్రారంభించడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరోస్థాయికి తీసుకెళ్తుంది. ?రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే రూ.13.5 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా.. సుమారు రూ.6.5 లక్షల మందికి ఉపాధి లభించింది. ?ఉత్తరాంధ్రకి గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి సంస్థలు వచ్చాయి. రాయలసీమలోనూ ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్ రంగాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. ?కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలబెట్టడమే మా లక్ష్యం’ అని చెప్పారు.

## కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**కాకినాడ, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రబీ, ఖరీఫ్ సీజన్లలో జిల్లాలోనే గండేపల్లి మండలంలో నెల రోజులు ముందుగానే కోతలు మొదలవుతాయని తితిదే బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గండేపల్లి మండలం ఎర్రంపాలెం గ్రామంలో శనివారం జిల్లాలో మొట్టమొదటి కొనుగోలు కేంద్రాన్ని జేసీ అపూర్వ భరత్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గండేపల్లి మండలంలో ఇప్పటికే 80 శాతానికిపైగా వరి కోతలు పూర్తయ్యాయన్నారు. నెల రోజులు ముందుగానే వ్యవసాయ, సివిల్ సప్లై అధికారులు కేంద్రాలను ప్రారంభిస్తే రైతులకు మేలు జరుతుందన్నారు. పౌరసరఫరాల శాఖ డీఎం నాయక్ మాట్లాడుతూ.. జిల్లాలో 227 కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు.

## గోదావరిలో ముగ్గురు యువకుల గల్లంతు

**ఒకిరి మృతదేహం లభ్యం**

**కోనసీమ, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక వద్ద ఘోర విషాదం చోటుచేసుకుంది. గోదావరి నదిలో స్నానానికి దిగి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. అందులో ఒకరి మృతదేహం లభించగా.. మిగిలిన వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. రాజమహేంద్రవరం జాంపేటకు చెందిన షేక్ బిలాల్(27), షేక్ సుల్తాన్ (20), మహ్మద్ అర్షద్ (18) పని నిమిత్తం బొబ్బర్లంకకు వెళ్లారు. అయితే, అక్కడ స్నానం చేసేందుకు గోదావరిలోకి దిగారు. లోతును సరిగ్గా అంచనా వేయలేక పోవడంతో నదిలో కొట్టుకుపోయారు. గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. వారిని కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ నదిలో కొట్టుకుపోయారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. గజఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా కాసేపటికి షేక్ బిలాల్ మృతదేహం లభించింది. షేక్ సుల్తాన్, మహ్మద్ అర్షద్ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కాగా, షేక్ సుల్తాన్ బీటెక్ చదువుతుండగా.. మహ్మద్ అర్షద్ ఇంటర్ చదువుతున్నాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. తమ వారు నదిలో కొట్టుకుపోయారని తెలుసుకుని బాధిత కుటుంబాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. వారి రోదనలు స్థానికులను సైతం కంటతడి పెట్టించాయి.

## నేలకోట కొండ ప్రాంతంలో పులి సంచారం

**గత నాలుగు రోజులుగా ఆందోళనలో ప్రజలు**

**పోలవరం, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పోలవరం జిల్లా దేవీపట్నం మండలంలోని నేలకోట కొండ ప్రాంతంలో పెద్దపులి సంచారం స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. గత నాలుగు రోజులుగా ఈ ప్రాంతంలో పులి సంచరిస్తుండటంతో అటవీ ప్రాంత ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారు. మరోవైపు అటవీ అధికారులు పులిని పట్టుకునేందుకు అన్నివిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. నేలకోట కొండపై సంచరిస్తున్న పులి అకస్మాత్తుగా స్థానికుల కంటపడింది. సాధారణంగా మనుషులు కనిపిస్తే దాడి చేసే పులి, ఇక్కడ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించింది. ఎదురుగా మనుషులు ఉన్నప్పటికీ, వారిపై దాడి చేయకుండా నెమ్మదిగా వెనక్కి వెళ్లిపోయింది. ఈ విషయం స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు రంగంలోకి దిగారు. పులి అడుగుజాడలను బట్టి దాని కదలికలను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా స్థానికులకు పలు కీలక సూచనలు చేశారు. అటవీ ప్రాంతాలకు సమీపంలో ఉండేవారు, పొలాల పనులకు వెళ్లేవారు గుంపులుగా వెళ్లాలని సూచించారు. చీకటి పడ్డాక ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, పశువుల కాపరులు మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. పులి ఎక్కడైనా కనిపిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## గడువు ముగుస్తోంది...

**ఇరాన్‌కుమరోమారు ట్రంప్ హెచ్చరిక**

**వాషింగ్టన్,ఏప్రిల్5(ఆర్ఎన్ఎ)** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి వార్నింగ్ ఇచ్చారు. తమతో ఒప్పందం చేసుకోవడానికి లేదా హర్మూజ్ జలసంధిని తెరవడానికి ఇరాన్ కు ఇచ్చిన పది రోజుల గడువు దగ్గరపడిందన్నారు. సమయం మించిపోతోందని, విధ్వంసానికి 48 గంటల సమయమే ఉందన్నారు. అంతా భగవంతుడి దయ! అంటూ ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. మరోవైపు అమెరికాకు చెందిన ఎఫ్–15 యుద్ధవిమానాన్ని ఇరాన్ కూల్చివేసిన విషయం తెలిసిందే. అయితే ఇందుకోసం అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలను ఉపయోగించినట్లు ఇరాన్ వెల్లడించింది. తమ గగనతలంపై పూర్తి నియంత్రణ ఉందని ఇరాన్ సైన్యం పేర్కొంది.


**ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్**
**(మునుపటి పేరు: శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)**

రిజిష్టర్డ్ ఆఫీస్ : శ్రీనివాస టవర్, 1వ అంతస్తు, డోరు నెం.5, పాత నెం.11, 2వ లేను, సెనటోఫ రోడ్డు, ఆల్వార్ పేట,తేనం పేట చెన్నై-600018.
ప్రధాన కార్యాలయము: లెవెల్-3, వాకర్ట్ టవర్స్, ఈస్ట్ వింగ్ సి-2, జి బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్), ముంబాయి-400 051, వెబ్‌సైట్: www.truhomefinance.in

**లాంఛనప్రాయ స్వాధీనత నోటీస్**

ఈ క్రింద పేర్కొన్న ట్రూహూమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇదివరలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) అధీకృత అధికారి గారు సెక్యూరిటీకరణ మరియు ఆర్థిక ఆస్తులు పునర్నిర్మాణం మరియు భద్రతా వడ్డీ చట్టం, 2002 (పేర్కొన్న చట్టం) మరియు సదరు చట్టంలో ఇవ్వబడిన సెక్షన్ 13(12)లోని అధికారాలతో నియమం 3 సెక్యూరిటీవడ్డీ (ఎన్ఫోర్స్మెంట్) చట్టం 2002లో పేర్కొన్న నియమాలను అనుసరించి, ఈ క్రింద పట్టికలో ఉదహరించిన రుణగ్రహీతలకు రుణంతిరిగి చెల్లించుట కొరకు డిమాండ్ నోటీసు జారీ చేసినారు. ఆ తరువాత రుణగ్రహీతలు రుణం చెల్లించుటలో విఫలమైనారు, కావున రుణ గ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు తెలియచేయునది ఏమనగా సదరు (చట్టం) లోని సెక్షన్ 13(4) రూలు 8 పేర్కొన్న చట్టం ప్రకారము ఈ దిగువ ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇదివరలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) సంతకందారు తేది 02-04-2026న దిగువ వివరించిన తనఖా ఆస్తిని లాంఛనప్రాయంంగా స్వాధీన పరచుకున్నారు.
ఈ నోటీసు ద్వారా రుణగ్రహీతలకు, సాధారణ ప్రజలకు తెలియచేయునది ఏమనగా ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇదివరలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) కంపెనీ వారు స్వాధీన పరుచుకున్న దిగువ పేర్కొన్న స్థిర ఆస్తిని యేవిధమైన లావాదేవీలు చేసిన యెడల కంపెనీకి కట్టవలసిన బాకీ మరియు వడ్డీకి లోబడి ఉండును.
చట్టం యొక్క సెక్షన్ 13 సబ్-సెక్షన్ (8) ప్రకారం సెక్యూర్డ్ ఆస్తులను రీడీమ్ చేయడానికి నిర్ణీత సమయాన్ని రుణగ్రహీతల దృష్టికి తీసుకురావటమైనది.

**రుణగ్రహీత పేరు మరియు చిరునామా**

1.శ్రీ లావుడియా రవి, S/O శ్రీ లావుడియా శ్రీను
2.శ్రీ లావుడియా శ్రీను, S/O సూరి
3.శ్రీమతి లావుడియా సిరిష, W/O శ్రీ లావుడియా రవి
4.శ్రీమతి లావుడియా రాజిని, W/O శ్రీ లావుడియా శ్రీను
చిరునామా: డోర్ నెం. 4-135, మైలవరం కనిమెర్ల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల దగ్గర, చంద్రాల, ఆంధ్రప్రదేశ్, ఇండియా - 521230

**డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం**

డిమాండ్ నోటీసు తేదీ: 15-12-2025
లోన్ ఖాతా నెం.: TMLHVJWD0000139 కు సంబంధించిన సూచన ప్రకారం, 31-12-2025 నాటికి రూ. 6,14,165/- (ఆరు లక్షల పద్నాలుగు వేల ఒక వంద అరవై ఐదు మాత్రమే) బాకీగా ఉన్నట్లు డిమాండ్ నోటీసు జారీ చేయబడింది.

**తనఖా ఆస్థి వివరాలు**

మొత్తం 338.8 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఆస్తి, 200 చదరపు అడుగుల ప్లింత్ ఏరియా గల A.C.C పైకప్పుతో కూడిన షెడ్‌తో, హౌస్ నెం. 4-135, అసెస్‌మెంట్ నెం. 614, సర్వే నంబర్ 48/1బి లో భాగంగా, వేదురుబీడం గ్రామంలో, మైలవరం సబ్-రిజిస్ట్రేషన్ పరిధిలో ఉంది. ఈ ఆస్తి సరిహద్దులు క్రింది విధంగా ఉన్నాయి: పడమర: గోగులోతు కొమిటి ఇంటి స్థలం , ఉత్తరం: లావుడియా రవి ఇంటి స్థలం , దక్షిణం: పంచాయతీ రహదారి , తూర్పు: పంచాయతీ రహదారి ఈ ఆస్తి మైలవరం సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా మరియు కృష్ణా రిజిస్ట్రేషన్ జిల్లాలో స్థితి చెందింది.

స్థలం: మైలవరం
తేది: 02-04-2026
సం/- అధికృత అధికారి – ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (మునుపటి పేరు శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# గ్రామాల అభివృద్ధికి దృష్టి సారించాలి!

రైజింగ్ తెలంగాణ, ట్రీ మిలియన్ ఎకానమీ...ఇవన్నీ వినడానికి బాగానే ఉన్నా..ఆచరణలో పట్టుదల ముఖ్యం. ఎపిలో స్వర్ణగ్రామం, స్వర్ వార్డులు అంటూ కొత్త పేర్లతో ఊదరగొడుతున్నారు. గ్రామాలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదు. ఎంతసేపు పల్లెలను విస్మరించి, పట్టణాలకే పెద్దపీట వేయడం సరికాదు. గ్రామాల అవసరాలను గుర్తించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. నిరంతరంగా ప్రభుత్వంపై ఆధారపడే దుస్థితి నుంచి తప్పించాలి. ఫ్యూచర్ సిటీ, దేశ పురోభివృద్ధి, ఆర్థికంగా బలోపేతంలో పదిశాతం భాగస్వామ్యం అవుతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి, గ్రామాలను విస్మరిస్తే అనుకున్న ఫలితాలను సాధించలేరు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గగలదు. గ్రామాల్లో విద్య,వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం వంటివన్నీ ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. గత రెండేళ్లుగా గ్రామాలు కునారిల్లాయి. కనీస వసతులు లేవు. గ్రామాల్లో అత్యధిక శాతం అధికార కాంగ్రెస్ ఆధిపత్యంలోనే ఉన్నాయి. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి విషయంలో అంతా కలసి రావాలి. గ్రామాలను బలోపేతం చేస్తేనే, గ్రామాల ఆర్థిక వ్యవస్థలు బలపడితేనే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందగలదు. అందువల్ల ఇప్పటి నుంచే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ఆలోచన చేయాలి. గ్రామాల్లో ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ పరిష్కరించలేనివేమీ కాదు. అందువల్ల వెంటనే ఇందుకు కార్యాచరణ చేయాలి. సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుద్యం వట్టి సమస్యలపై ఇరు రాష్ట్రాల సిఎంలు శ్రమించాలి. ఉచిత పథకాలు పెరిగినా కొద్దీ గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడుతోంది. పనిచేసే కూలీలు దొరక్క రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. అన్నీ ప్రభుత్వం చేస్తుందనే ధోరణి నుంచి ప్రజలు బయపటడేలా చేయాలి. నా గ్రామాన్ని నేనే కాపాడుకోవాలన్న నినాదంతో ముందుకు సాగాలి. సర్పంచ్‌లను అందుకు భాగస్వాములను చేయాలి. అనవసర పథకాలకు వేలకోట్లు తగలేసే బదులు గ్రామాలను అభివృద్ధి చేసే కార్యాచరణకు నిధులు వెచ్చించాలి. ప్రభుత్వంపై ఆశతో ప్రజలు ఉన్నారని గుర్తించాలి. ఏదో చేస్తారన్న నమ్మకం ఉంది. ఇందిరమ్మ ఇళ్లు కావచ్చు, ఇతర అభివృద్ధికావచ్చు గ్రమాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలి. ప్రపంచ చిత్రపటంలో తెలంగాణను ముందువరసలో నిలబెడతామంటున్న ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు గ్రామాలను విస్మరిస్తే ముందుకు సాగలేరు. ప్రధానంగా తాగునీటి సమస్య, వైద్యరంగాలను, విద్యారంగాన్ని బలోపేతం చేయాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యచరణ ఉంటే నిరుద్యోగిత కూడా తగ్గుతుంది. వ్యయసాయాధిరత చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలో తెలంగాణకు ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌కు అత్యధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. చారిత్రకంగా, భౌగోళికంగా,ఆర్థికంగా దేశ అభివృద్ధిలో తెలంగాణ అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అబివృద్ధి ఆధునిక, హైటెక్ రాజధానిగా అభివృద్ధి చెందింది. దేశంలో ప్రధాన మెట్రో సిటీలుగా ప్రసిద్ధి చెందిన ఢిల్లీ, చెన్నై, ముంబయ్, కలకత్తాల కంటే అనువైన వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ తెలంగాన అభివృద్ది చెందడానికి అనువైన వాతావరణం ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ది చేస్తే రాజధానులపై ఒత్తిడి తగ్గుతంది. ప్రధానంగా వ్యవసాయాధారిత పరిశ్రమలతో యువతను గ్రామాలకు మళ్లించాలి. దాంతో ఆర్థికంగా ఎదుగుదలతో పాటు గ్రామాలు పురోగమిస్తాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఉజ్వల తెలంగాణ నిర్మాణానికి పూనుకుంటే అది దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయరంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి దోహదపడగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధికి దోహదపడేలా చేయాలి. అప్పుడే తెలంగాన కల సాకారం కాగలదు. గతంలో లాగా చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. వ్యవసాయ పంటల కొనుగోళ్లను సజావుగా సాగేలా చూడాలి. పంటల విధానంలో మార్పులు రావాలి. ఇవన్నీ జరిగితేనే అనుకున్న అభివృద్ధి సాధ్యం కాగలదు.

# మహిరాష్ట్రలో ఘోర ప్రమాదం

❑బావిలోకి దూసుకెళ్లిన కారు

❑ఒకే కుటుంబానికి చెందిన 9మంది మృతి

**ముంబై,ఏప్రిల్5(ఆర్ఎన్ఎ):** మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ఉన్న 9 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారని మృతుల బంధువులు తెలిపారు. నాసిక్ జిల్లా డిండోరీ తాలూకాలో ఈ ప్రమాదం జరిగింది. శివాజీ నగర్‌లో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి తమ స్వగ్రామానికి వెళ్తుండగా వారిని మృత్యువు కబలించింది. వివరాల్లోకి వెళ్తే.. నాసిక్ జిల్లాలోని డిండోరీ ప్రాంతానికి చెందిన సునీల్ దత్తాత్రేయ దర్గుడే (34).. తన భార్య రేష్మా దర్గుడే (30), కుమార్తె రాఖీ అలియాస్ గుణవతి దర్గుడే, వదిన ఆశా దర్గుడే (32), ఆమె కుమారుడు శ్రేయాస్ దర్గుడే, కుమార్తె శ్రిష్టి దర్గుడేతో కలిసి కారులో శివాజీనగర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. వేసవి సెలవులు కావడంతో.. ఫంక్షన్ అనంతరం రేష్మా దర్గుడే మేరకోడళ్లు మాధురి, శ్రావణి.. అశా దర్గుడే మేన కోడలు సమృద్ధి కూడా వారితో ఇండోర్ గ్రామానికి బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో డిండోరీ తాలూకా కేంద్రంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఓ బావిలోకి దూసుకెళ్లింది. అది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్స్ సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సాయంతో కారును బయటికి తీశారు. ఆ కారులో 8 మృతదేహాలు ఉన్నాయి.

కారు నుంచి బయటపడిన మరో బాలిక మృతదేహాన్ని గజ ఈతగాళ్లు వెతికి వెలికి తీశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికిగల కారణాలపా ఆరా తీస్తున్నట్లు తెలిపారు. ప్రమాద సమయంలో సునీల్ దత్తాత్రేయ దర్గుడే కారు నడుపుతున్నట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. కాగా ఈ ప్రమాదంలో మరణించిన ఆరుగురు పిల్లలు 7 నుంచి 14 ఏళ్ల మధ్య వయసు వారేని తెలిపారు. ఆ ఆరుగురిలో ఒకరు బాలుడు, ఐదుగురు బాలికలు ఉన్నట్లు చెప్పారు.

# బాసర మాస్టర్ ప్లాన్‌కు సిఎం రేవంత్ ఓకే

రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి... ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మాణాలు... 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపన... అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించిన రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆర్ఎన్ఎ):** బాసర ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 6న బాసర సరస్వతి ఆలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సుమారు రూ. 225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించి సమగ్ర మాస్టర్ ప్లాన్ ఇప్పటికే సిద్ధం కాగా, ఆలయాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రహదారులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆలయ పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఈవీ వాహనాలనే అనుమతించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని స్పష్టం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఆలయ పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నియంత్రణలు ఉండాలని సీఎం పేర్కొన్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ, ఆలయాన్ని అభివృద్ధి చేసే దిశగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశంచేశారు. బాసర ఆలయ అభివృద్ధిపై



ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను, రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆదేశించారు. తిరుమల తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నిబంధనలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశానికి మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ నెల 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. రూ.225 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

# ఆందోళన కలిగిస్తున్న గ్యాస్ కొరత

సంక్షోభంతో హోట్ పరిశ్రమ కుదేలు.... సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు



**పల్నాడు,ఏప్రిల్5(ఆర్ఎన్ఎ):** దేశవ్యాప్తంగా గ్యాస్, ఆయిల్ రంగాలలో ఏర్పడిన సంక్షోభం సాధారణ ప్రజలపై భారంగా మారిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగి, రాష్ట్రంలో బ్లాక్ మార్కెటింగ్ విస్తరించిందని, చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు గ్యాస్ సంక్షోభంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.జీవనోపాధి కోల్పోయిన యువకులు, కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అధికారులు మార్కెట్లో గ్యాస్ అందుబాటులో ఉందని చెబుతున్నా, వాస్తవానికి అది సామాన్య ప్రజలకు అందడం లేదని విమర్శించారు. కృష్ణా-గోదావరి బేసిన్‌లో పుష్కలంగా గ్యాస్ వనరులు ఉన్నప్పటికీ, ప్రైవేట్ కంపెనీలు రోజుకు సుమారు 21 వేల టన్నుల గ్యాస్‌ను తవ్వి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నాయని, రాష్ట్రానికి మాత్రం సరిపడా సరఫరా జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర అవసరం రోజుకు కేవలం 4 వేల టన్నులే అయినప్పటికీ, ఆ అవసరాన్ని కూడా తీర్చకపోవడం అన్యాయమని అన్నారు. దీనివల్ల విదేశాల నుంచి అధిక ధరలకు గ్యాస్ దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని, ఆ భారాన్ని వినియోగదారులపై మోపుతున్నారని పేర్కొన్నారు. కృష్ణా-గోదావరి బేసిన్ గ్యాస్‌ను స్థానికంగా పైప్‌లైన్ల ద్వారా పీఎన్‌జీగా సరఫరా చేస్తే, గృహాలకు తక్కువ ధరకే గ్యాస్ అందుబాటులోకి వస్తుందని, ఇది సామాన్య ప్రజలకు, చిన్న వ్యాపారులకు పెద్ద ఊరట కలిగిస్తుందని వివరించారు. నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి, రాష్ట్రానికి న్యాయమైన గ్యాస్ వాటాను సాధించేందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. మా గ్యాస్-మా హక్కు' నినాదంతో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. మొదటిగా రాజమండ్రిలో భారీ ప్రజాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజా మద్దతుతో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# బిఆర్ఎస్ ఖాతాలో ఇబ్రహింపట్నం, క్యాతన్‌పల్లి

●పట్నం ఛైర్మన్‌గా టేకుల సుదర్శన్ రెడ్డి ఎన్నక

●క్యాతన్‌పల్లి ఛైర్‌పర్సన్‌గా గొడిశెల సంధ్యారాణి ఎన్నిక

●రెండుచోట్లా ఎన్నికలకు దూరంగా ఉన్న కాంగ్రెస్

**హైదరాబాద్,ఏప్రిల్5(ఆర్ఎన్ఎ):** రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఛైర్మన్‌గా టేకుల సుదర్శన్‌రెడ్డి ఎన్నికయ్యారు. వైస్ ఛైర్‌పర్సన్‌గా భాజపా కౌన్సిలర్ ముత్యాల శ్యామలను ఎన్నుకున్నారు. మరోవైపు మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీని కూడా గులాబీ పార్టీ దక్కించుకుంది. ఇక్కడ ఛైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి సంధ్యారాణి ఎన్నికయ్యారు. వైస్ ఛైర్‌పర్సన్ పదవిని సీపీఐ అభ్యర్థి సరిత దక్కించుకున్నారు. ఈ ఎన్నికకు కాంగ్రెస్ కౌన్సిలర్లు దూరంగా ఉన్నారు. గత కొన్ని రోజులుగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ వీడింది. ఎట్టకేలకు ఈ మున్సిపాలిటీని భారత్ రాష్ట్ర సమితి కైవసం చేసుకుంది. ఛైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి టేకుల సుదర్శన్‌రెడ్డి ఎన్నికయ్యారు. వైస్ ఛైర్‌పర్సన్‌గా బీజేపీ కౌన్సిలర్ ముత్యాల శ్యామలను ఎన్నుకున్నారు. మరోవైపు.. ఈ ఎన్నికలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికను వాయిదా వేయాలని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ 55 రోజులు క్యాంప్ నిర్వహించిందని కాంగ్రెస్ ఆరోపించింది. ముగ్గురు కౌన్సిలర్లపై కోర్టులో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్నిక నిర్వహించడం సరైనది కాదని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయితే కోర్టు ఆదేశాల మేరకు ఎన్నిక నిర్వహించామని ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. దీంతో ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. ఈ ఎన్నికలో భారత్ రాష్ట్ర సమితి తరఫున సుదర్శన్ రెడ్డి ఛైర్మన్ అభ్యర్థిగా పోటీ చేయగా, కాంగ్రెస్ తరఫున ఆకుల యాదగిరి పేరును ప్రతిపాదించారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలను చేతులు ఎత్తే విధానంలో నిర్వహించారు. ఎట్టకేలకు బీఆర్ఎస్ ఈ మున్సిపాలిటీని తన ఖాతాలో వేసుకుంది. గతంలో అనేక విధ్యాలుగా గొడవలకు కారణంగా మారిన క్యాతనపల్లి మున్సిపాలిటీ పీఠాన్ని అధికారిక కాంగ్రెస్ పార్టీ దక్కించుకోలేకపోయింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్ కౌన్సిలర్ గొడిశెల సంధ్యారాణి ఎన్నికయ్యారు. సీపీఐ మద్దతుతో ఆమె మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికల్లో విజయం సాధించారు. ఇక బీఆర్ఎస్ మద్దతుతో సీపీఐ కౌన్సిలర్ మిట్టపల్లి సరిత వైస్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్, సీపీఐ పొత్తు పెట్టుకోగా, 22 వార్డులకుగాను 10 వార్డుల్లో బీఆర్ఎస్, 4 వార్డుల్లో సీపీఐ అభ్యర్థులు గెలుపొందారు. బీఆర్ఎస్-సీపీఐ కూటమికి స్పష్టమైన బలం ఉన్నది. కాంగ్రెస్ అభ్యర్థులు ఏడు స్థానాల్లోనే గెలిచారు. కానీ, మంత్రి వివేక్, కాంగ్రెస్ నేతల అరాచకాల వల్ల గతంలో ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నిక ప్రక్రియ నిలిచిపోయింది. చివరకు కోర్టు ఆదేశాలతో శనివారం క్యాతనపల్లి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికను నిర్వహించారు. తాజాగా నిర్వహించిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికకు కాంగ్రెస్ కౌన్సిలర్లు దూరంగా ఉన్నారు. బీఆర్ఎస్, సీపీఐ నుంచి ఎన్నికైన 14 మంది కౌన్సిలర్లు మాత్రం ఎన్నికకు హాజరయ్యారు.

# ప్రజల దృష్టి మరల్చేందుకు దాడులు

మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్5(ఆర్ఎన్ఎ):** అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విధ్వంసమే పరామవధిగా కొనసాగుతున్న కాంగ్రెస్ నాయకుల దాడి ఈసారి బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి చేశారు. గజ్వేల్ లోని క్యాంపు కార్యాలయంలోకి చొరబడ్డ కాంగ్రెస్ కార్యకర్తలు విధ్వంసం సృష్టించారు.కేసీఆర్ క్యాంపు కార్యాలయం ప్రభుత్వ ఆస్తి, దానిని ధ్వంసం చేయడం అంటే ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడమేనని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం చేతగాక ప్రజల దృష్టి మరల్చేందుకు కాంగ్రెస్ ఇలాంటి చర్యలను ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం మీద ఇలాంటి చర్యలకు పాల్పడితే ఇక సామాన్యులకు రక్షణ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన దుండగులను గుర్తించి, కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో పోలీసులు అలసత్వం వహించడం గర్హనీయమని పేర్కొన్నారు.

# సిబిఎస్ఇ త్రిభాషా విధానంపై ఆగ్రహం

ఇది హిందీని రుద్దే కార్యక్రమంగా ఉంది... తమిళనాడు సిఎం స్టాలిన్ అభ్యంతరం

**చెన్నై,ఏప్రిల్5(ఆర్ఎన్ఎ):** 2026-27 విద్యా సంవత్సరంలో 6వ తరగతి నుండి త్రిభాషా విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు సిబిఎస్ఇ తాజాగా ప్రకటించింది. త్రిభాషా విధానంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ శనివారం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది ప్రాంతీయ భాషల కంటే హిందీకి ఎక్కువ ప్రాధాన్యత నివ్వడానికి, ఆ భాషను బలవంతంగా రుద్దడానికి చేసే ప్రయత్నమేనని ఆయన మండిపడ్డారు. ఈ విధానం సమాఖ్యవాదాన్ని దెబ్బతీస్తుందని, హిందీ మాట్లాడని రాష్ట్రాలను అణచివేస్తుంది. పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులపై అనవసర భారాన్ని మోపుతుందని స్టాలిన్ ఆరోపించారు. భారతదేశ భాషా వైవిధ్యాన్ని గౌరవించాలని, రాష్ట్రాలవ్యాప్తంగా విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని స్టాలిన్ కోరారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, 'జాతీయ విద్యా విధానం 2020కి అనుగుణంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) విద్యార్థులు మూడు భాషల్ని చదవాలని తెచ్చిన కొత్త పాఠ్యప్రణాళిక విధానం నిష్కపటమైన విద్యా సంస్కరణ కాదు. ఇది హిందీని బలవంతంగా రుద్దాలని ఉద్దేశపూర్వకంగా చేసే ప్రయత్నం. ఇది బిజెపి హిందీని మాపై బలవంతంగా రుద్దుతుంది అన్న ఆందోళనల్ని నిజం చేస్తుంది. భారతీయ భాషలను ప్రోత్సహించే ముసుగులో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం భారతదేశపు గొప్ప, వైవిధ్యభరితమైన భాషా వారసత్వాన్ని క్రమపద్ధతిలో అణచివేస్తూ, హిందీని



ప్రాధాన్యతనిచ్చే కేంద్రీకరణ ఎజెండాను దూకుడుగా ముందుకు తీసుకెళ్తోంది. మూడు భాషల సూత్రం అని పిలిచేది వాస్తవానికి హిందీ మాట్లాడని ప్రాంతాలలోకి హిందీని విస్తరించడానికి ఉద్దేశించిన ఒక రహస్య యంత్రాంగం. కేంద్ర ప్రభుత్వ పాఠ్య ప్రణాళిక విధానం హిందీ మాట్లాడే విద్యార్థులకు నిర్మాణాత్మకంగా ప్రాధాన్యతనిస్తుంది. నిష్పక్షపాతాన్ని, సమాఖ్యవాదాన్ని, ప్రాంతీయ సమానత్వాన్ని దెబ్బతీస్తుంది' అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో విమర్శించారు. ఇలాంటి విధానాలు భారతదేశ భాషా వైవిధ్యానికి ముప్పు కలిగిస్తాయని స్టాలిన్ హెచ్చరించారు. విద్యార్థుల హక్కులు, ప్రాంతీయ గుర్తింపు కోసం నిలబడాలని తమిళనాడులోని ఏఐఎడిఎంకె, దాని ఎన్‌డిఎ మిత్రపక్షాలకు ఆయన పిలుపునిచ్చారు.÷-రిభాషా విధానం వల్ల దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులను హిందీని నేర్చుకోవడం తప్పనిసరి చేస్తుంది. మరి హిందీ మాట్లాడే రాష్ట్రాల విద్యార్థులు తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, లేదా బెంగాలీ, మరాఠీ వంటి భాషలను కూడా తప్పనిసరిగా నేర్చుకుంటారా? దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు, ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థులకు మధ్య నేర్చుకునే విధానంలో స్పష్టత లేదు. ఈ విధానం ఏకపక్షంగా హిందీని రుద్దడమనే వివక్షాపూరిత స్వభావాన్ని బయటపెడుతుంది. ఈ వైరుధ్యం ఆమోదయోగ్యం కాదు. కేంద్ర ప్రభుత్వం కేంద్రీయ విద్యాలయ సంఘటన్ పాఠశాలల్లో తమిళాన్ని తప్పనిసరి భాషగా చేయడంలో విఫలమైంది. తమిళ భాషను బోధించడానికి తమిళ ఉపాధ్యాయులను నియమించడంలో విఫలమైంది. మరి ఇప్పుడు అదే కేంద్ర ప్రభుత్వం భారతీయ భాషలను ప్రోత్సహించడంపై రాష్ట్రాలకు ఉపన్యాసాలు ఇవ్వాలని చూస్తోందని స్టాలిన్ ఎద్దేవా చేశారు. ఇది భాషల పట్ల కేంద్రం చూపే వైఖరి నిబద్ధత కాదు.. పచ్చి కపటత్వం అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో ధ్వజమెత్తారు. మిళనాడు అనేక ఇతర రాష్ట్రాలు లేవనెత్తి చట్టబద్ధమైన, స్థిరమైన ప్రజాస్వామ్యయుతమైన ఆందోళనలను పక్కనపెట్టి, హిందీని రుద్దడానికి కేంద్ర ప్రభుత్వం నిశ్చయించుకున్నట్లు కనిపిస్తోంది. ఈ విధానం సహకార సమాఖ్యవాద సూత్రాలకు విరుద్ధం. లక్షలాది మంది భారతీయుల భాషా గుర్తింపు అవమానించడమే అని స్టాలిన్ అన్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడులోని తిరు పళనిస్వామి నేతృత్వంలోని ఏఐఎడిఎంకె, దాని ఎన్‌డిఎ మిత్రపక్షాలు ఈ రుద్దకాన్ని అంగీకరిస్తాయా? లేక ఒక్కసారైనా మన విద్యార్థుల హక్కులు, గుర్తింపు, భవిష్యత్తు కోసం నిలబడతాయా? అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో ప్రశ్నించారు.

# ఆస్తమా లేదా ఉబ్బసం ఉందా? వీటిని తినకండి





వాయు కాలుష్యం ప్రస్తుతం పెరుగుతోంది. ఆస్తమా బాధితులకు కలుషితమైన గాలి చాలా ప్రమాదకరం. ఉబ్బసం ఉన్నవారు ఎప్పుడూ కలుషిత ప్రాంతాలకు దూరంగా ఉండాలి. ఆరోగ్యంగా ఉండటానికి, వారు ఎల్లప్పుడూ తమ చుట్టూ ఉన్న ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచాలి. ఉబ్బసం ఉన్నవారు ఉబ్బసంకు కారణాల గురించి తెలుసుకోవాలి మరియు అప్రమత్తంగా ఉండాలి. ఉబ్బసం ధూళి ద్వారా కాకుండా ఆహారం ద్వారా ప్రేరేపించబడుతుంది. మీరు ఇప్పటికే ఉబ్బసంతో బాధపడుతుంటే, మీరు కొన్ని ఆహారాలకు దూరంగా ఉండాలి. ఈ వ్యాసం ఆస్తమాను తీవ్రతరం చేసే కొన్ని ఆహారాలను అందించింది. ఇది చదివి వాటిని నివారించండి మరియు ఉబ్బసం నుండి దూరంగా ఉండండి.

పాల ఉత్పత్తులు ఉబ్బసం రోగులు పాల ఉత్పత్తులకు దూరంగా ఉండాలి. ఎందుకంటే పాల ఉత్పత్తులు ఉబ్బసం ప్రేరేపించే అవకాశం ఉంది. ఐస్ క్రీం, పెరుగు మరియు జున్ను వంటి పాల ఉత్పత్తులు కూడా ఉబ్బసం రేకెత్తిస్తాయి. పాలు ఉత్పత్తులను తినే ఉబ్బసం ఉన్నవారికి దగ్గు మరియు తుమ్ము సాధారణ సమస్యలు. ఉబ్బసం ప్రేరేపించే కొన్ని సాధారణ ఆహారాలు గుడ్లు, సిట్రస్ పండ్లు, గోధుమలు మరియు సోయా ఉత్పత్తులు ఉబ్బసం ప్రమాదాన్ని పెంచుతాయి. కాబట్టి ఉబ్బసం బాధితులు ఈ ఆహారాలను వారి ఆహారం నుండి తొలగించడం మంచిది.

సిట్రస్ పండ్లు చాలా బాగున్నాయి. కానీ కొంతమంది సిట్రస్ పండ్లు అధికంగా తీసుకోవడం వల్ల ఆస్తమా వస్తుంది. అదేవిధంగా, సోయా ఉత్పత్తులు మరియు గోధుమలు కొన్నిసార్లు ఉబ్బసం లక్షణాలను రేకెత్తిస్తాయి.

ప్రాసెస్ చేసిన ఆహారాలు ఉబ్బసం బాధితులకు మాత్రమే కాకుండా, ప్రాసెస్ చేసిన ఆహారాన్ని నివారించడం మంచిది. ఎందుకంటే ఇది చాలా సమస్యలను కలిగిస్తుంది. ఉబ్బసం బాధితులు ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తీసుకుంటే, వాటిలో క ృత్రిమ సాస్‌లు మరియు ఇతర పదార్థాలు అలెర్జీని రేకెత్తిస్తాయి. కాబట్టి ఈ ఆహారాలు తినడం మానుకోవాలి, ముఖ్యంగా ఆస్తమాతో బాధపడేవారికి. కఫం ఏర్పడటానికి కారణం అయ్యే ఆహారాలు అరటి, బొప్పాయి, బియ్యం, చక్కెర మరియు పెరుగు జలుబును ఉత్పత్తి చేసే ఆహారాలు. అలాగే, మీరు సులభంగా జీర్ణం కాని కాఫీ, టీ, సాస్ మరియు ఆల్కహాల్ పానీయాలు తీసుకుంటే, అది ఉబ్బసం కలిగిస్తుంది.

నట్స్ గింజలు ఆరోగ్యకరమైన ఆహార పదార్థం. అయినప్పటికీ, గింజలను ఉబ్బసం ఉన్నవారు తింటే, అది పరిస్థితిని మరింత దిగజార్చుతుంది. కాబట్టి గింజలకు దూరంగా ఉండండి. ఫాస్ట్ ఫుడ్ ఉబ్బసం ఏ స్థితిలో ఉందో తెలుసుకుంటే ఫాస్ట్ ఫుడ్ ప్రభావంపై ఒక అధ్యయనం ప్రకారం, ఆస్తమా ఉన్నవారు ఫాస్ట్ ఫుడ్ తింటే ఆస్తమా రెట్టింపు తీవ్రత ఉంటుంది. ఈ ప్రభావం ముఖ్యంగా పిల్లలలో వస్తుంది.

# అందమైన ముఖం కోసం కొద్దిగా పెరుగు కూడా కలపండి



చర్మ సమస్యలతో బాధపడని వారు ఎవరూ ఉండరు. చికిత్స కోసం వివిధ క్రీములు మరియు క్రీములను ఉపయోగించేవారు చాలా మంది ఉండవచ్చు. కానీ వాటిని ఉపయోగించని వారు కొన్ని సహజ ఉత్పత్తులను కూడా జోడించవచ్చు. వాటిలో పెరుగు ఒకటి. కొన్ని పదార్థాలతో పెరుగు వాడటం వల్ల మీ చర్మం అందంగా, ఆరోగ్యంగా కనిపిస్తుంది. చర్మ చికిత్సలకు కీలకం మీ చర్మ రకాన్ని తెలుసుకోవడం మరియు నివారణ పొందడం. లేపనాలు, జిడ్డుగల చర్మం, పొడి చర్మం, సాధారణ చర్మం మరియు కలయిక చర్మం ఉపయోగించడం వల్ల మీ చర్మం వదిలించుకోవచ్చు. మిశ్రమ చర్మ కలయిక చర్మం ఉన్నవారికి చాలా కష్టమైన విషయం ఏమిటంటే వారు హైడ్రేటింగ్ ఉత్పత్తి లేదా చమురు నియంత్రిత ఉత్పత్తి కావాలా అని నిర్ణయించుకోవడం. కొన్నిసార్లు, చర్మం పూర్తిగా పొడిగా ఉంటుంది, పొరలుగా ఉండే మచ్చలను నిలుపుకుంటుంది లేదా కొన్నిసార్లు జిడ్డుగా మారుతుంది. మీకు కాంబినేషన్ స్కిన్ ఉంటే, పెరుగు నమ్మకమైన అందం సంరక్షకుడు. ముఖ అందాన్ని మెరుగుపరచడానికి మీరు పెరుగును ఉపయోగించే కొన్ని మార్గాలు ఇక్కడ ఉన్నాయి.

**పెరుగు మరియు తేనె:** ప్రకాశవంతమైన మరియు హైడ్రేటింగ్ ఈ ఫేస్ ప్యాక్ మీ చర్మం మెరుస్తూ, మృదువుగా మరియు గ్లో చేస్తుంది. పెరుగులోని లాక్టిక్ ఆమ్లం మృదువైన చర్మంగా పనిచేస్తుంది. మీకు ప్రకాశవంతమైన చర్మాన్ని ఇస్తుంది. అదనంగా, తేనె ఒక సహజ మాయిశ్చరైజర్. తేనె యొక్క శోథ నిరోధక లక్షణాలు కూడా చర్మం నయం చేయడానికి సహాయపడతాయి. ఎలా తయారుచేసుకోవాలి పెరుగు: 1 టేబుల్ స్పూన్ మరియు తేనె: 1/2 టేబుల్ స్పూన్. రెండింటినీ కలిపి శుభ్రమైన ముఖం మీద రాయండి. 15 నిమిషాల తరువాత, మీ ముఖాన్ని గోరువెచ్చని నీటితో కడగాలి. ఇది చర్మానికి సహజమైన గ్లో ఇవ్వడానికి సహాయపడుతుంది. మరియు చర్మాన్ని తేమగా ఉంచుతుంది. పెరుగు మరియు సీవీడ్: చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేయడానికి ఈ ఫేస్ స్క్రబ్ ఉత్తమ ప్రయోజనం ఏమిటంటే ఇది చర్మాన్ని ఆరబెట్టదు. చర్మంపై ఉన్న అదనపు నూనెను తొలగించి, చర్మం యొక్క పిహెచ్ బ్యాలెన్స్‌ను నిర్వహించడానికి ఇది మీకు సహాయపడుతుంది. అందువల్ల, ఈ కలయిక చర్మానికి అనువైనది.

**ఎలా తయారుచేసుకోవాలి**

మీకు కావలసింది పెరుగు: 1 టేబుల్ స్పూన్, వేరుశెనగ పిండి: 1/2 స్పూన్, ఆరెంజ్ పీల్ పౌడర్: 1/4 స్పూన్. అన్ని పదార్థాలను పేస్ట్ రూపంలో కలపండి. పెరుగు లేదా సీవీడ్ మొత్తాన్ని సర్దుబాటు చేయండి. ముఖాన్ని శుభ్రపరచండి మరియు ఈ మిశ్రమాన్ని మీ ముఖం మీద రాయండి. 15-20 నిమిషాల తరువాత, గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోండి. అప్పుడు మాయిశ్చరైజర్ రాయండి. పెరుగు మరియు దాల్చినచెక్క: మచ్చలు తగ్గించడానికి చర్మంపై మచ్చలను తగ్గించడానికి ఈ కలయికకు చికిత్స చేసినప్పుడు, పొడి భాగాలు మరింత పొడిగా మారుతాయి. కానీ సరైన ఫేస్ ప్యాక్ దీనిని పరిష్కరించగలదు. పెరుగు మరియు దాల్చినచెక్క కలపడం ద్వారా మీరు దీన్ని మీ చర్మంపై పూయవచ్చు. మొదట దాల్చిన చెక్క ప్యాచ్‌టెస్ట్ ఉపయోగించండి. ఈ ఫేస్ ప్యాక్ మీకు ప్రకాశవంతమైన చర్మాన్ని ఇవ్వడానికి సహాయపడుతుంది మరియు రెగ్యులర్ వాడకంతో మచ్చలను తగ్గిస్తుంది.

**ఎలా తయారుచేసుకోవాలి** పెరుగు: 1 టేబుల్ స్పూన్, తేనె: 1/2 స్పూన్, దాల్చినచెక్క పొడి: 2 చిటికెడు, పసుపు: ఒక చిటికెడు. 15-20 నిమిషాల తర్వాత దాన్ని కడగాలి. దాల్చినచెక్క మీ ముఖం మీద మెత్తబడటం ప్రారంభిస్తే, వెంటనే మీ ముఖాన్ని కడగాలి. దీన్ని అప్లై చేసిన తర్వాత స్క్రబ్ చేయవద్దు, మీ ముఖాన్ని ఎప్పటిలాగే కడగాలి. అప్పుడు కలబంద జెల్ లేదా ఏదైనా జెల్ ఆధారిత మాయిశ్చరైజర్‌తో మీ ముఖాన్ని కడగాలి.

# తెలంగాణ సంపద కొల్లగొడుతున్న రేవంత్

**కాంగ్రెస్ ఎన్నికల ఫండ్ కోసం రాష్ట్ర సంపద తరలింపు**

**బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ఘాటు విమర్శలు**

**వరంగల్,ఏప్రిల్5(ఆర్ఎన్ఎ):** తెలంగాణ ప్రజల సంపదను రేవంత్ రెడ్డి కొల్లగొడుతున్నారని ఈటల రాజేందర్ ఆరోపణలు గుప్పించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల కోసం రాష్ట్ర ప్రజల సంపదను తరలిస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆరు గ్యారెంటీలు, ఫీజురీయింబర్స్‌మెంట్ సహా పలు అంశాలపై సీఎంకు ప్రశ్నలు సంధించారు. తెలంగాణ ఎన్నికల వేళ ఆరు గ్యారంటీలు- 66 హామీల పేరుతో ప్రజలను ఆయన మోసం చేశారని ఎంపీ ఈటల ఆగ్రహించారు. రాష్ట్ర ప్రజానీకం గంపెడు ఆశలతో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే.. చట్ట సభల్లో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వ్యక్తిగత దూషణలతో కాలం వృథా చేశారని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 నుంచి ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో రూ.600 కోట్లు మాత్రమే విడుదల చేసిందని ధ్వజమెత్తారు. పేద విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాటం ఆడుతోందని ఆగ్రహించారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలు ఎలా సాధ్యమవుతుందని ఎన్నికల వేళ అగినప్పుడు.. తాను చేసి చూపిస్తానని రేవంత్ ప్రగల్భాలు పలికారని చెప్పారు. ఇప్పుడు హామీలు అమలు చేయకుండానే చేసినట్లు చెప్పుకుంటున్నారని విమర్శించారు. వేల కోట్ల విలువ చేసే భూములను ప్రైవేట్ వ్యక్తులతో కలిసి సీఎం రేవంత్ అమ్ముకుంటున్నారంటూ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు చేశారు.

# 28 జిల్లాలతో కొత్తగా ఎపి మ్యాప్ విడుదల

**అమరావతి ప్రాంతానికి ప్రత్యేకంగా గుర్తిపు**

**అమరావతి,ఏప్రిల్5(ఆర్ఎన్ఎ):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా రాష్ట్ర నూతన మ్యాప్‌ను విపత్తు నిర్వహణ శాఖ విడుదల చేసింది. మొత్తం 28 జిల్లాలతో కూడిన ఈ అధికారిక మ్యాప్‌ను ఈ నెల 2వ తేదీన ప్రచురించారు. ఇందులో అత్యంత కీలకమైన అంశం ఏంటంటే.. రాజధాని అమరావతి ప్రస్తావన, కొత్తగా ఏర్పడిన జిల్లాల సరిహద్దులను స్పష్టంగా పొందుపరిచారు. ఈ నూతన మ్యాప్‌లో రాజధాని అమరావతిని ప్రత్యేకంగా హైలెట్ చేశారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల సరిహద్దుల మధ్యలో అమరావతిని 'రాష్ట్ర రాజధాని' గా చూపుతూ మ్యాప్‌ను రూపొందించారు. అయితే అమరావతికి ప్రత్యేక బౌండరీలను కేటాయించకుండానే, ఆ ప్రాంతాన్ని రాజధానిగా గుర్తించడం గమనార్హం. ఈ నూతన మ్యాప్‌లో రాజధాని అమరావతిని ప్రత్యేకంగా హైలైట్ చేశారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల సరిహద్దుల మధ్యలో అమరావతిని.. రాష్ట్ర రాజధానిగా చూపుతూ మ్యాప్‌ను రూపొందించారు. ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేసేందుకు.. గతంలో ఉన్న 26 జిల్లాలకు అదనంగా.. ఇటీవల మార్కాపురం, పోలవరం అనే రెండు కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ రెండు జిల్లాల సరిహద్దులను కూడా తాజా మ్యాప్‌లో తెలియజేశారు. దీంతో ఏపీలో మొత్తం జిల్లాల సంఖ్య 28కి చేరింది. రాష్ట్ర విపత్తు నిర్వాహణ శాఖ ఈ మ్యాప్‌ను విడుదల చేయడం వెనుక ప్రధాన ఉద్దేశం.. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు లేదా అత్యవసర పరిస్థితుల్లో జిల్లాల వారీగా సహాయక చర్యలు చేపట్టడానికి స్పష్టమైన భౌగోళిక సమాచారం ఉండటమే. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత సరిహద్దుల విషయంలో ఉన్న సందిగ్ధతను ఈ మ్యాప్ తొలగించనుంది.

# ఖానాపూర్ మున్సిపల్ ఎన్నిక వాయిదా

**చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్ల మధ్య వివాదం ... ఎన్నిక సందర్భంగా జోగురామన్న హౌజ్ అరెస్ట్**

నిర్మల్,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ):ఖానాపూర్ ఛైర్‌పర్సన్ ఎన్నిక నేపథ్యంలో కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్ల మధ్య వివాదం నెలకొంది. అధికారులతో ఎమ్మెల్యే, కాంగ్రెస్ కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. దీంతో నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారన్న దానిపై సందిగ్ధత నెలకొంది. ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అధికారులతో ఎమ్మెల్యే బొజ్జు, కాంగ్రెస్ కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలోనే సమావేశం నుంచి ఎమ్మెల్యే బయటకు వెళ్లిపోయారు. మరోవైపు మున్సిపల్ కార్యాలయం ఎదుట భాజపా, బీఆర్ఎస్ సభ్యులు ఆందోళనకు దిగారు.

# అమరావతి నిర్మాణంలో జాప్యం సహించను

**చకచకా పనులు సాగి తీరాల్సిందే... అధికారులు, కాంట్రాక్ట్ సంస్థలకు ఆదేశం... అమరావతి చరిత్రలో అందరూ భాగస్వాములే**

**నిర్మాణ పనులపై సమీక్షలో సిఎం చంద్రబాబు**

**అమరావతి,ఏప్రిల్5(ఆర్ఎన్ఎ):** రాజధాని అమరావతి పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థల తీరుపై ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి నిర్మాణాలు పూర్తి చేసి తీరాల్సిందే అని ఆదేశాలు జారీ చేశారు. రాజధాని నిర్మాణ పనులపై సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిర్మాణాలు చేస్తున్న కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు, పలువురు అధికారులపై ఆయన సీరియస్ అయ్యారు. అలాగే రాజధాని అమరావతి నిర్మాణ ప్రాంతాల్లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాలపైనా సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ సందర్భంగా నిర్మాణ సంస్థల తీరును తప్పుపట్టారు. నిర్మాణ సామగ్రికి రక్షణ కల్పించే బాధ్యత కాంట్రాక్ట్ సంస్థలకు లేదా? అంటూ ఆయన ప్రశ్నించారు. కాంట్రాక్ట్ సంస్థల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయని ఆగ్రహించారు. ఘటన తర్వాత కూడా కాంట్రాక్ట్ సంస్థలు, అధికారులు సరిగా స్పందించలేదని మండిపడ్డారు. రాజధాని నిర్మాణానికి ఇసుక, గ్రావెల్ సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆజ్ఞాపించారు. ఇసుక, గ్రావెల్ కొరతతో నిర్మాణ పనుల్లో జాప్యం



జరగకూడదని సీఎం చంద్రబాబు చెప్పారు. అయితే, కృష్ణాజిల్లా అటవీ శాఖ అధికారుల వల్లే గ్రావెల్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ముఖ్యమంత్రి దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. అటవీ అధికారులతోనే అసలు సమస్య వస్తోందన్నారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా అటవీశాఖ అధికారుల తీరుపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధానికి అవసరమైన ఇసుక, గ్రావెల్ గ్రీన్ ఛానెల్ ద్వారా వెళ్లాలని ఆదేశించారు. మెటీరియల్ సరఫరాలో ఎవరి ఒత్తిళ్లకూ లొంగొద్దని హుకుం జారీ చేశారు. ఎవరైనా ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి అంశాన్నీ వక్రీకరించేలా కొందరు రాజకీయాలు చేస్తున్నారని.. ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలి కదా? అంటూ సున్నితంగా హెచ్చరించారు. రగరాని ఘటనలు జరిగితే వెంటనే అలర్ట్ చేయాల్సిన బాధ్యత లేదా? అంటూ కాంట్రాక్ట్ సంస్థలను చంద్రబాబు ప్రశ్నించారు. ప్రభుత్వంపై బురద జల్లేందుకు కొందరు సిద్ధంగా ఉన్నారన్నారు. నిర్మాణ సంస్థలు సమర్థులైన ప్రాజెక్ట్ మేనేజర్లను నియమించుకోవాలన్నారు. అలా చేయకుంటే ఆ ప్రభావం ప్రభుత్వంపై పడుతుందన్నారు సీఎం. ఇలాంటి నిర్లక్ష్యపు ధోరణిని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించమని సీఎం చంద్రబాబు వారికి తేల్చి చెప్పారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ స్థలంలో సుమారు 20 వేల మంది కార్మికులు, నిపుణులు పని చేస్తున్నారు. ప్రతి నిర్మాణ సంస్థ ఎంత మేరకు పనులు పూర్తి చేసింది, టార్గెట్లను ఎంతవరకు సాధించింది అనే విషయాలపై పనుల వారీగా ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కార్మికుల సంఖ్య, యంత్రాల వినియోగం వంటి అంశాలపై కూడా సమగ్ర చర్చ చేపట్టారు. వారం, నెలవారీ టా÷-గ్గ౦÷ట్‌లు నిర్దేశిరచుకుని పనులు పూర్తి చేయాలని అధికారులు, సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు. వర్షాకాలం ముందు పూర్తి చేయాల్సిన పనులపై అధికారులు తమ లక్ష్యాలను సీఎంకు వివరించారు. రాజధాని నిర్మాణాన్ని కేవలం కాంట్రాక్ట్ వర్క్‌గా చూడొద్దని.. ఇప్పుడు పనులు చేపట్టే వారంతా చరిత్రలో భాగస్వాములవుతున్నట్టే అని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు తెలిపారు. 'నిర్మాణ సంస్థలుగా మీరు ఎన్నో ప్రాజెక్టులు చేసి ఉంటారు... కానీ రాజధాని నగరాన్ని నిర్మించే అవకాశం అందరికీ దక్కదు. రాజధానిని అద్భుతంగా, వినూత్నంగా నిర్మించేందుకు అపార అవకాశాలున్నాయి. అమరావతిని ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేసి చూపించాల్సింది మీరే. నాణ్యతతో నిర్మాణాలు ఉండాలి... కాస్ట్ ఎఫెక్టివ్ చర్యలు తీసుకోవాలి. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ వంటి వాటిని వినియోగించుకోవాలి. రాజధాని ప్రతిష్ఠను పెంచేలా ఎవరికైనా ఆలోచనలు వస్తే వాటిని ప్రభుత్వంతో పంచుకోవచ్చు. ప్రభుత్వం నిర్దేశిరచిన సమయానికి నిర్మాణం పూర్తి చేసి తీరాల్సిందే. ఈ విషయంలో ఏ మాత్రం రాజీ ఉండదు. మ్యాన్ పవర్ పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

# గోదావరిఖనిలో ఘోర రోడ్డు ప్రమాదం

**స్తంభాన్ని ఢీకొన్న కారు: ఒకరు మృతి**


**పెద్దపల్లి,ఏప్రిల్5(ఆర్ఎన్ఎ):**గోదావరిఖనిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సింగరేణి కార్మికులు ప్రయాణిస్తున్న ఓ కారు అతివేగంతో వచ్చి రాజేశ్ థియేటర్ వద్ద ఉన్న కరెంటు స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. దీంతో కారులోనే వారంతా ఇరుక్కుపోయారు. ఇది గమనించిన స్థానికులు.. కారులోని వారిని బయటకు తీశారు. అనంతరం అంబులెన్స్‌ల్లో ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్లే ప్రమాదం జరిగినట్లుగా అనుమానిస్తున్నారు.

# నందిగామ వీధుల్లో ఎమ్మెల్యే సౌమ్య బైక్ ర్యాలీ సందడి ...



**నందిగామ ఏప్రిల్ 05( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు లోక్‌సభ, రాజ్యసభల్లో ఆమోదం పొందడంతో రాష్ట్రవ్యాప్తంగా కూటమి శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. ఈ సందర్భంగా నందిగామ పట్టణంలో శుక్రవారం ఘనంగా ఆనందోత్సవాలు నిర్వహించారు. నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా గాంధీ సెంటర్ వరకు సాగింది. ర్యాలీలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నినాదాలతో ఉత్సాహంగా ముందుకు సాగారు. అమరావతి రాజధానికి చట్టబద్ధత లభించడం రాష్ట్ర అభివృద్ధికి కీలకమని వారు పేర్కొన్నారు. గాంధీ సెంటర్‌కు చేరుకున్న అనంతరం బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. పటాకుల శబ్దాలతో ప్రాంతం మార్మోగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అమరావతికి న్యాయం జరిగిందని తెలిపారు. ప్రజా రాజధానికి దక్కిన గౌరవం ఇదేనని పేర్కొన్నారు. అమరావతి అభివృద్ధి ద్వారా రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు అమరావతి బిల్లుకు వైసీపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలపడం ప్రజాస్వామ్యానికి మంచి ఉదాహరణ అని అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని అభివర్ణించారు. అమరావతి నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా కృషి కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు, మహిళలు పాల్గొని సంబరాల్లో భాగమయ్యారు. మొత్తం కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగి నందిగామలో పండుగ వాతావరణాన్ని తీసుకువచ్చింది.

# రాష్ట్రంలో మహిళలకు రక్షణ ఎక్కడ : వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల...




**నందిగామ ఏప్రిల్ 05( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : రాష్ట్రంలో మహిళల భద్రత, శాంతి భద్రతల పరిస్థితి విషమంగా మారుతోందని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల ఆందోళన వ్యక్తం చేశారు. నందిగామలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల పల్నాడు జిల్లా మాచర్లలో యువతిపై జరిగిన దాడి ఘటనను తీవ్రంగా ఖండించారు. ఆ ఘటనపై ప్రభుత్వ స్పందన తీరుపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నా, బాధితులకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు. మహిళల భద్రతపై అధికార యంత్రాంగం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. మహిళా హోంమంత్రి ఉన్న రాష్ట్రంలోనే మహిళలకు ఇళ్లలోనూ, బయటా రక్షణ లేకపోవడం బాధాకరమని శ్యామల అన్నారు. మహిళలు స్వేచ్ఛగా సంచరించలేని పరిస్థితులు ఏర్పడటం రాష్ట్రానికి మంచిది కాదన్నారు. ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకుని మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాచర్ల ఘటనలో నిందితులను వెంటనే అరెస్టు చేసి, బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణలో విఫలమవుతున్న ప్రభుత్వంపై ప్రజలు ఆలోచించాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోకపోతే పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

## క్యాంప్ బెల్ పేట పాఠశాలనుఆకస్మిక తనిఖీ చేసిన డిఇఓ.



**మచిలీపట్నం ఏప్రిల్ 05( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని కృష్ణాజిల్లా డిఇఓ ఉద్బోధించారు. శనివారం క్యాంపు బెల్ పేట గ్రామంలో పదవ తరగతిలోకి ప్రవేశించిన విద్యార్థుల ఇళ్లకు డిఇఓ సుబ్బారావు వెళ్లి తల్లిదండ్రులకు వారి విద్య పై సలహాలు సూచనలు అందించారు. పదవ తరగతిలోకి ప్రవేశించిన విద్యార్థుల శ్రవణ, పఠన ,లేఖన, భాషణ, నైపుణ్యాలను పరిశీలించారు. శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్యాంపు బెల్ పేట ను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. అంతేకాక జిల్లా విద్యాశాఖాధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల పరిధిలో 9వ తరగతి నుండి పదవ తరగతిలోకి ప్రవేశించిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఆయా విద్యార్థుల విద్యపై తల్లిదండ్రులతో ముచ్చటించారు. కృష్ణాజిల్లా కలెక్టర్ డికే బాలాజీ పదవ తరగతిలోకి ప్రవేశించిన విద్యార్థుల విద్య పట్ల ఈ సంవత్సరం ప్రారంభం నుండే ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు ఎం వి ఎస్ డి ప్రసాద్ , వైఎస్ఆర్ కే గురుప్రసాద్ ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో ఇంటింటి సందర్శనకు వెళ్లారు ఈ సందర్భంగా విద్యార్థుల చదువుపై ఆసక్తి, అభ్యసన స్థాయి, 10 వ తరగతి పాఠ్యాంశాలపై అవగాహన వంటి అంశాలపై చర్చిస్తూ, వారికి ప్రోత్సాహాన్ని అందించారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ వేసవి సెలవులలో "బ్రిడ్జ్ కోర్స్" అమలు విధానాన్ని సమగ్రంగా పరిశీలించి, విద్యార్థులు సమగ్రంగా నేర్చుకోవాలని సూచించారు. నేర్చుకునే విషయంలో లోటుపాట్లను పూరించేందుకు చేపడుతున్న చర్యలను పరిశీలించారు. అలాగే పాఠశాలలో అమలవుతున్న జి ఎఫ్ ఎల్ ఎన్ ప్రోగ్రామ్ పై సంబంధిత వాలంటీర్‌తో ప్రత్యేకంగా మాట్లాడి, కార్యక్రమం అమలు తీరు, విద్యార్థుల పురోగతి, బోధన పద్ధతులపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలు మరింత పెంపొందించేందుకు ఆధునిక బోధన విధానాలు అవలంబించాలని ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు, వాలంటర్ లకు సూచించారు. ఇంకా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ప్రోత్సాహక చర్యలు చేపట్టాలని, రెగ్యులర్ మానిటరింగ్ ద్వారా మెరుగైన ఫలితాలు సాధించాలని అధికారులను ఆదేశించారు.

# రైతులకు కొత్త పాస్‌పుస్తకాలు..

## ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పంపిణీ...



**నందిగామ ఏప్రిల్ 05( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : పెనుగంచిప్రోలు మండలంలోని లింగగూడెం, తోటచర్ల గ్రామాల్లో రైతులకు నూతనంగా మంజూరైన భూ పాస్‌పుస్తకాలను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య శుక్రవారం గ్రామసభల్లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వం రైతుల అభిప్రాయాలను గౌరవిస్తూ కొత్త పాస్‌పుస్తకాలను అందజేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో రైతుల సొంత భూములకు సంబంధించిన పాస్‌పుస్తకాలపై నాటి ముఖ్యమంత్రి ఫోటో ముద్రించడం పట్ల ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రైతుల ఆస్తులపై ఎలాంటి రాజకీయ గుర్తులు ఉండకూడదనే ఉద్దేశంతో, కూటమి ప్రభుత్వం రాజముద్రతో కొత్త పాస్‌పుస్తకాలను మంజూరు చేసిందని వివరించారు రైతుల హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని, వారికి అవసరమైన సౌకర్యాలు అందించడంలో ఎలాంటి లోటు ఉండదన్నారు. కొత్త పాస్‌పుస్తకాలతో రైతులకు భూములపై పూర్తి స్పష్టత లభిస్తుందని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని తెలిపారు ఈ కార్యక్రమానికి గ్రామాల్లో మంచి స్పందన లభించింది. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై పాస్‌పుస్తకాలను స్వీకరించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని పలువురు రైతులు స్వాగతించారు. కార్యక్రమంలో తహశీల్దార్, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తెలిపారు.

# దళిత డప్పు కళాకారుని పై దాడి హేయమైన చర్య



**మచిలీపట్నం ఏప్రిల్ 05( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : మచిలీపట్నం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం 3 వ వార్డు లో మరిడి తల్లి పండుగలో డప్పు కళాకారుని పై స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెయ్యి చేసుకోవడాన్ని తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ పార్టీ కృష్ణా జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొడమంచిలి చంద్రశేఖర్. ఈ సందర్భంగా కె. చంద్రశేఖర్ మాట్లాడుతూ అయ్యన పాత్రుడు స్పీకర్ పదవిలో ఉండి చట్టాని రక్షించవలసిన బాధ్యత మరచి అహంకారపూరితంగా డప్పు కళాకారుని పై దాడి హేయమైన చర్య అని దళితులపై దాడికి పాల్పడిన అయ్యన్నపాత్రుని పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు మరల పునరావృతం కాకుండా వాటిని నివారించవలచిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. చంద్రబాబు నాయుడు,లోకేష్ లు స్పందించి వెంటనే చర్య తీసుకోవాలని లేదంటే భవిష్యత్తులో తీవ్రమైన నష్టం తప్పదు అని హెచ్చరించారు. అదేవిధముగా డప్పు కళాకారునికి ఎస్ సి ఎస్ టీ చట్టం ప్రకారం నష్టం పరిహారం ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు చేస్తామన్నారు.

# నోరుందని అడ్డగోలుగా వాగితే తాట వలిచేస్తాం

**అక్రమాలపై చర్యలు తీసుకుంటే అధికారుల్ని బెదిరిస్తావా?**

**కులాలు, మతాల పేరుతో బందరులో కుట్రలు చేస్తే సహించేది లేదని పేర్ని నానికి మంత్రి కొల్లు రవీంద్ర వార్నింగ్.**




**మచిలీపట్నం ఏప్రిల్ 05( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : మచిలీపట్నంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను అధికారులు తొలగిస్తే పేర్ని నాని ఎందుకు అంత రాద్ధాంతం చేస్తున్నాడో సమాధానం చెప్పాలని మంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. అక్రమ కట్టడాలపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా మాజీ మంత్రి పేర్ని నాని, ఆయన కుమారుడు వ్యవహరించిన వైఖరి రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి నిర్మాణాలు చేపట్టిన విషయం వాస్తవం కాదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల ముందు, పెద్దల సమక్షంలో కట్టడాలు చేయమని హామీ ఇచ్చి, రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు చేపడితే అధికారులు చూస్తూ ఊరుకుంటారా? నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్న కమిషనర్, ఎస్పీ, సీఐ వంటి అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు. అధికారులు తమ విధులు నిర్వహిస్తుంటే నీకెందుకు అంత నొప్పి. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు చిలకలపూడి ప్రాంతంలో పేదల ఇళ్లు కూల్చివేసిన ఘటనలో కూడా నాని పాత్ర ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. 130 అడుగుల రోడ్డు పేరుతో యాదవ సోదరుల ఇళ్లను కూల్చివేయాలని ప్రయత్నించిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేదని హెచ్చరించారు. గాంధీ బట్టల దుకాణం విషయంలో జరిగిన ఘటనలో ఆయన మానసికంగా ఇబ్బంది పడటానికి కారణం పేర్ని నాని కాదా? పేర్ని నాని లాంటి వ్యక్తిని కన్నందుకు వారి తల్లిదండ్రుల ఆత్మ క్షోభిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తండ్రికి ఒక్కరోజైనా అన్నం పెట్టావా అని నిలదీశారు. గత 5 సంవత్సరాలుగా రామ్ నితీష్ మాల్ నిర్మాణాన్ని అడ్డుకున్న విషయం కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బైపాస్ రోడ్ విషయంలోనూ అనేక వివాదాలు తలెత్తాయి. ఎన్ని పాపాలు చేశావు నాని... నువ్వు అసలు మనిషివేనా అంటూ తీవ్రంగా విరుచుకుపడ్డారు. కూటమి ప్రభుత్వానికి కులాల మతాలు లేవు. ప్రజల కోసమే పని చేస్తున్నామని స్పష్టం చేశారు.మీ మున్సిపల్ పదవీకాలం ముగిసిన తర్వాతే భోగరాజు పట్టాభి సీతారామయ్య భవనం నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. వంగవీటి రంగా హత్యలో సంబంధం ఉన్న వ్యక్తులను ఇంటికి పిలిచి విందులు పెట్టిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మేము ఎప్పుడూ ధర్మ పక్షాన నిలబడతాము. ఇప్పటికే 2600 జిం3 ఇళ్లు నిర్మించి అర్హులైన వారికి అందించామని తెలిపారు. ఇళ్ల పంపిణీ విషయంలో బాధ్యతగా వ్యవహరిస్తున్నాం.. డ్రైనేజీ వ్యవస్థను ఫేజ్ వైజ్‌గా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పేర్ని నాని అర్ధరాత్రి సమయంలో దొంగ పట్టాలు ఇచ్చిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అధికారులను బలిచేసింది పేర్ని నాని అని విమర్శించారు. ధర్మం ప్రకారం ముందుకు సాగుతామని, ఎవరైనా నష్టపోతే వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ అధికారులను వారి విధులు నిర్వహించుకోవాలని, బాధ్యత గల రాజకీయ నాయకుడిలా ప్రవర్తించాలని హెచ్చరిస్తూ, ఇకపై అధికారులు కాలర్ ఎత్తుకుని పనిచేసేలా ప్రభుత్వం తరపున చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు.

# రేపే టెన్త్ స్పాట్ వాల్యుయేషన్



**మచిలీపట్నం ఏప్రిల్ 05( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : పదవ తరగతి స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ రేపటినుండి ప్రారంభం కాబోతోంది. స్పాట్ వెలివేషన్ కావలసిన ఏర్పాట్లను కృష్ణాజిల్లా డీఈవో యు వి సుబ్బారావు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ లేడీ యాంప్థిల్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి స్పాట్ వెలివేషన్ 6 వతేదీ నుండి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లుగా కృష్ణా జిల్లా డిఇఓ యు వి సుబ్బారావు తనను కలిసిన పాత్రికేయులకు తెలిపారు. ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ స్పాట్ నిర్వహణకై కావలసిన ఏర్పాట్లు అన్ని పూర్తి చేసినట్లుగా తెలిపారు. క్యాంప్ ఆఫీసర్ ఆధ్వర్యంలో 8 మంది ఏసీ వోలు, 78 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 433 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 230 మంది స్కూల్ అసిస్టెంట్లు ఈ స్పాట్ వాల్యుయేషన్ నిర్వహణ లో పాల్గొంటారని తెలిపారు. ప్రతిరోజు అసిస్టెంట్ ఎగ్జామినర్ కి 40 పేపర్లు వాల్యూ చేయడానికి ఇవ్వడం జరుగుతుందన్నారు. సబ్జెక్టుల వారీగా పరీక్ష పేపర్లు దిద్దడానికి రూమ్స్ కేటాయించడం జరిగిందన్నారు. మొత్తం 741 మంది సిబ్బంది స్పాట్ వాల్యూయేషన్ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అదనంగా రిజర్వ్ సిబ్బందిని కూడా అవసరం మేరకు నియమించడం జరిగిందన్నారు. స్పాట్ వాల్యుయేషన్ కార్యక్రమం అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుందన్నారు. పది రోజుల్లో సిబ్బంది మొత్తం 1,84,000 పరీక్ష పేపర్లు మూల్యాంకనం చేయడం జరుగుతుందన్నారు. అసిస్టెంట్ ఎగ్జామినేటర్లు దిద్దిన పేపర్లను చీఫ్ ఎగ్జామినర్లు చెక్ చేయడం జరుగుతుందని, స్పెషల్ అసిస్టెంట్లు దిద్దిన పేపర్ల టోటల్ మార్క్స్ పేజ్ వైస్ గా చెక్ చేయడం జరుగుతుందని అన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో మంచినీటి వసతి ఏర్పాటు చేశామన్నారు.

# వేసవికాలం వచ్చింది తస్మాత్ జాగ్రత్త

## మచిలీపట్నం ప్రజలకు పోలీసు వారి విజ్ఞప్తి.




**మచిలీపట్నం ఏప్రిల్ 05( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : మిగతా కాలాలతో పోలిస్తే వేసవికాలంలో దొంగతనాలు ఎక్కువగా జరిగే ఆస్కారం ఉంటుందన్నారు. పిల్లలకి స్కూలు సెలవులు ఇవ్వడంతో చుట్టాలింటికి, విహారయాత్రలకు వెళ్లడం జరిగితే సదరు విషయాన్ని పోలీసు శాఖకు సమాచారం అందించాలన్నారు. వేసవి తాపానికి తలుపులు పూర్తిగా వేయకుండా దగ్గరికి వేసుకుని ఆరు బయట పడుకోవడం, తలుపులు తెరిచి పడుకోవడం చేయకూడదన్నారు. పిల్లలకు పరీక్షలు అయిపోయిన పిదప ఇంటికి సరైన కాపలా పెట్టుకోకుండా, పోలీసు స్టేషన్ కు సమాచారం ఇవ్వకుండా తీర్థయాత్రలకు, పుణ్యక్షేత్రాలకు వెళ్లడం చేయకుండా చూసుకోవాలన్నారు. ఎవరైనా తాళం పెట్టి ఊరు వెళ్లిన తమ ఇంటిని వస్తువులను భద్రపరుచుకుని పోలీసు వారికి తగిన సమాచారం అందించాలన్నారు. దీనిని నివారించాలంటే పోలీసు వారి సూచనలు తప్పక పాటించాలన్నారు. దయచేసి ఎవరూ ఇంటికి సరైన రక్షణ,కాపలా ఏర్పాటు చేసుకోకుండా, ఎక్కడికి వెళ్ళకూడదని మనవి చేస్తున్నామన్నారు. అదేవిదంగా ప్రజలు ఎవరైనా ఇంటికి తాళాలు వేసి ఊరు వెళ్ళే ముందు తమకి సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే యజమానులు, అద్దెకు నివసించేవారు ఇంటిలో ఉన్న బంగారు ఆభరణాలు నగదు ముఖ్యమైన వస్తువులు బ్యాంకు లాకర్ నందు భద్రపరుచుకుని వెళ్లవలసిందిగా కోరుచున్నామన్నారు. పార్థి గ్యాంగ్ సంచారం నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళల్లో ఎవరైనా తలుపులు తడితే తీయవద్దని, ఎవరైనా అనుమానితులు తారసపడితే వెంటనే సమీప పోలీస్ వారికి సమాచారం అందించాలని తెలియజేశారు.

# అగ్ని ప్రమాదం కు బడ్డీ దగ్ధం



**మచిలీపట్నం ఏప్రిల్ 05( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : మచిలీపట్నం స్థానిక చిలకలపూడి సిడబ్ల్యూసీ గోడౌన్ దగ్గర శనివారం షార్ట్ సర్క్యూట్ తో ఒక బడ్డీ దగ్ధం అయ్యింది. బడ్డీలో నుండి తీవ్రమైన పొగలు మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళన చెంది అగ్నిమాపక శాఖ అధికారులకు సమా చారం అందించారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపు చేశారు. బడ్డీ యజమాని వివరాలు తెలుసుకొని యజమానికి సమాచారం అందించారు. అనంతరం నష్టాన్ని తెలుసుకున్నారు . బడ్డీ లో అగ్ని ప్రమాదం ఎలా సంబంధించిందోనని దర్యాప్తు చేస్తున్నారు.

# పల్నాడు పోలీసు శాఖలో ప్రకంపనలు

## : వారం వ్యవధిలోనే ఇద్దరు సీఐలపై వేటు!



**పల్నాడు ఏప్రిల్ 05( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : పల్నాడు జిల్లాలో కొందరు పోలీసు అధికారుల తీరు అప్రతిష్టాత్మకంగా మారడమే కాకుండా, శాఖా పరమైన కఠిన చర్యలకు దారితీస్తోంది. కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు సీఐలపై వేటు పడటం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా సంచలనం రేపుతోంది. వివాహేతర సంబంధం వంటి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న దాచేపల్లి సీఐ పొన్నూరు భాస్కర్‌ను ఉన్నతాధికారులు వీఆర్‌కు బదిలీ చేయగా.. మరోవైపు మాచర్లలో చోటుచేసుకున్న పరువు హత్య ఉదంతంలో విధి నిర్వహణలో ఘోరంగా విఫలమైనందుకు అక్కడి పట్టణ సీఐపై సస్పెన్షన్ వేటు పడింది. రక్షక భటులే వరుస వివాదాల్లో చిక్కుకోవడం, ఉన్నతాధికారులు సత్వరమే కఠిన నిర్ణయాలు తీసుకోవడం ఇప్పుడు పోలీసు వర్గాల్లోనూ, ప్రజల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది.

# గొట్టుముక్కల శివారులో గంజాయి ముఠా అరెస్ట్...



**నందిగామ ఏప్రిల్ 05( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : కంచికచర్ల మండలం గొట్టుముక్కల శివారులో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. శనివారం నిర్వహించిన దాడుల్లో తొమ్మిది మంది సభ్యులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సమాచారం మేరకు, నిందితులు సీలేరు ప్రాంతం నుంచి గంజాయిని తీసుకువచ్చి, స్థానికంగా చిన్న ప్యాకెట్లుగా మార్చి విక్రయించేందుకు సిద్ధమవుతుండగా పోలీసులు ముట్టడించారు. పక్కా సమాచారం ఆధారంగా ప్రత్యేక బృందం దాడి చేసి వారిని అదుపులోకి తీసుకుంది అరెస్టైన వారి నుంచి గంజాయి సంచులు, ప్యాకింగ్ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా కొంతకాలంగా ప్రాంతంలో గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో స్థానికంగా కలకలం రేగింది. నిందితులపై చీణూూ చట్టం కింద కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. అక్రమ మాదక ద్రవ్యాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

# భానుప్రియ మతిస్థిమితం కోల్పోయిందా?




ఒకప్పుడు తెలుగు సినిమాల్లో ఒక వెలుగు వెలిగిన కథానాయికల్లో భానుప్రియ ఒకరు. 80వ దశకంలో తెలుగులో ఉన్న అందరు అగ్రకథానాయికులతోనూ ఆమె సినిమాలు చేశారు. 'స్వర్ణకమలం' సహా ఎన్నో చిత్రాల్లో తన అందం, అభినయంతో ఆమె కట్టిపడేశారు. ఐతే తర్వాత ఆమెకు అవకాశాలు తగ్గిపోయాయి. కొన్నేళ్లు క్యారెక్టర్ రోల్స్‌లో కనిపించిన భానుప్రియ.. క్రమంగా సినీ రంగానికి దూరం అయిపోయారు. కొన్నేళ్లుగా భానుప్రియ ఆరోగ్యం బాగా లేదని వార్తలు వస్తున్నాయి. ఇటీవల ఆమె పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారిందని.. డిమెన్షియా కారణంగా మతిస్థిమితం కూడా కోల్పోయిందని.. ఎవరినీ గుర్తించే పరిస్థితిలో కూడా లేదని ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై భానుప్రియ చెల్లెలు, 'మహర్షి' సహా పలు చిత్రాల్లో నటించిన శాంతి ప్రియ స్పందించారు. భానుప్రియ ఆరోగ్యం బాగా లేని మాట వాస్తవమే అని.. కానీ ఆమె జ్ఞాపక శక్తి కోల్పోయి ఎవరినీ గుర్తించలేని స్థితిలో ఉందంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ఆమె స్పష్టం చేసింది. ఇండస్ట్రీ నుంచి ఎవ్వరూ భానుప్రియను పట్టించుకోవడం లేదని.. 80వ దశకం రీ యూనియన్‌కు కూడా తన సోదరిని పిలవట్లేదని శాంతి ప్రియ ఆవేదన వ్యక్తం చేసింది. భానుప్రియ ఫోన్ నంబర్ లేకపోతే తనకు లేదా తమ అన్నయ్యకు ఫోన్ చేసి మాట్లాడొచ్చని.. ఇండస్ట్రీలో అందరికీ ఆయన తెలుసని.. అయినా ఎవ్వరూ భానుప్రియ కోసం సంప్రదించలేదని శాంతి ప్రియ పేర్కొంది. భర్త మరణం తర్వాత భానుప్రియ డిప్రెషన్‌కు గురైందని.. ఆమె కొన్నేళ్లుగా మనోవేదన అనుభవిస్తోందని శాంతిప్రియ చెప్పింది. ఆమెకు కొన్ని సినిమాల్లో అవకాశాలు వచ్చాయని.. కానీ తన పాత్ర గురించి ముందు ఒకటి చెప్పి, తీరా షూట్‌కు వెళ్లాక ఆ పాత్రలను మార్చేయడం వల్ల భానుప్రియ ఎంతో బాధ పడ్డారని.. అందుకే ఆమె సినిమాలకు దూరం అయ్యారని ఆమె చెప్పింది. భానుప్రియ ఇకపై సినిమాల్లో నటించరని.. తాను మాత్రం నటిగా కొనసాగుతానని శాంతి ప్రియ స్పష్టం చేసింది. 'బ్యాడ్ గర్ల్' సినిమాలో తన పాత్రకు భానుప్రియనే డబ్బింగ్ చెప్పిందని.. ఆమె మానసిక స్థితి ఏమీ దెబ్బ తినలేదని.. ఆమె గురించి అసత్యాలు ప్రచారం చేయొద్దని శాంతి ప్రియ కోరింది.




## స్పిరిట్ ఊచకోతకు 'అనంత' ఎలివేషన్స్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కలయికలో రాబోతున్న 'స్పిరిట్' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. 'యానిమల్' వంటి భారీ విజయం తర్వాత వంగా చేస్తున్న ప్రాజెక్ట్ కావడంతో, ప్రభాస్ ను ఆయన ఎలా ప్రెజెంట్ చేస్తారనే క్యూరియాసిటీ అందరిలోనూ ఉంది. ఈ సినిమాలో ప్రభాస్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా కనిపిస్తారని ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది. ఈ చిత్రానికి సంబంధించి పాటల రచయిత అనంత శ్రీరామ్ ఇచ్చిన లీక్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ?సినిమా అంటే కేవలం యాక్షన్ మాత్రమే కాదు, అందులో బలమైన ఎమోషన్ కూడా ఉండాలని నమ్మే వ్యక్తి సందీప్ వంగా. 'స్పిరిట్' కోసం అనంత శ్రీరామ్ ఇప్పటికే రెండు పాటలను పూర్తి చేశారట. ఈ సినిమా ఆల్బమ్ ఒక క్లాసిక్ లా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అయితే ప్రభాస్ ను క్లాసిక్ యాంగిల్ లో చూడటం కొంచెం కొత్తగా అనిపించినా, కథలోని సందర్భాలు దానికి తగ్గట్టుగా కుదిరాయని ఆయన వెల్లడించారు. క్లాసిక్ సాంగ్స్ తో పాటు సినిమాలో మాస్ ఆడియన్స్ ఆశించే అసలైన ఊచకోత కూడా ఉంటుందని హింట్ ఇచ్చారు. ?సందీప్ వంగా సినిమాల్లో హీరో క్యారెక్టరైజేషన్ చాలా ఇంటెన్స్ గా ఉంటుంది. 'స్పిరిట్' లో ప్రభాస్ బాడీ లాంగ్వేజ్, పోలీస్ ఆఫీసర్ గా ఆయన చేసే యాక్షన్ సీక్వెన్స్ లు ఇప్పటివరకు వచ్చిన పోలీస్ సినిమాలకు భిన్నంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. గతంలో ప్రభాస్ చేసిన యాక్షన్ సినిమాల కంటే ఇందులో ఆవేశం కొంచెం ఎక్కువగానే ఉండొచ్చని అనంత శ్రీరామ్ మాటలను బట్టి అర్థమవుతోంది. కేవలం తన మార్క్ యాక్షన్ తోనే కాకుండా, క్లాసిక్ మ్యూజిక్ తో కూడా ప్రేక్షకులను సర్ప్రైజ్ చేయడానికి వంగా పక్కా ప్లాన్ తో ఉన్నారు. ఈ సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్ మ్యూజిక్ అందిస్తున్నాడు. ?ఇక సినిమా షూటింగ్ ఇప్పటికే ఒక షెడ్యూల్ పూర్తి చేసుకుని, తదుపరి భారీ షెడ్యూల్ కోసం సిద్ధమవుతోంది. ప్రభాస్ కూడా తన లుక్ కోసం ప్రత్యేకంగా కష్టపడుతున్నారు. సందీప్ వంగా సినిమాల్లో విజువల్స్ చాలా నేచురల్ గా, 'రా'గా ఉంటాయి. 'స్పిరిట్' లో కూడా అదే స్టైల్ ను ఫాలో అవుతూ, సినిమాను గ్లోబల్ స్టాండర్డ్స్ లో రూపొందిస్తున్నారు. ?సాధారణంగా పోలీస్ సినిమాలు అంటే కొన్ని రొటీన్ సన్నివేశాలు ఉంటాయి. కానీ వంగా మార్క్ పోలీస్ ఎలా ఉంటాడో ఇప్పటికే ఫ్యాన్స్ ఊహించుకుంటున్నారు. "మీరు కోరుకున్నంత ఊచకోత సినిమాలో ఉంటుంది" అని అనంత శ్రీరామ్ చెప్పడం చూస్తుంటే, ప్రభాస్ లోని అగ్రెసివ్ యాంగిల్ ను వంగా పూర్తిస్థాయిలో వాడుకున్నట్లు కనిపిస్తోంది. యాక్షన్ బ్లాక్స్ లో వైలెన్స్ లెవెల్స్ 'యానిమల్' కంటే ఒక రేంజ్ లో ఉంటాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# బ్లాక్ బస్టర్ స్ట్రీక్‌కు బ్రేక్ పడబోతోందా?

అనామకుడైన ఒక కుర్రాడు హీరోగా నటించిన తొలి సినిమాతోనే వంద కోట్ల వసూళ్లు రాబట్టడమే అనూహ్యం. అలాంటిది ఆ హీరో తర్వాతి రెండు చిత్రాలు కూడా అదే స్థాయిలో విజయవంతం కావడం ఇంకా ఆశ్చర్యం. తమిళ కుర్రాడు ప్రదీప్ రంగనాథన్ ఈ ఘనతే సాధించాడు. జయం రవి హీరోగా 'కోమాలి' అనే సినిమాతో దర్శకుడిగా పరిచయం అయిన ప్రదీప్.. ఆ సినిమాతో ఓ మోస్తరు ఫలితాన్ని అందుకున్నాడు. కానీ తర్వాత తనే హీరోగా నటిస్తూ రూపొందించిన 'లవ్ టుడే' సినిమాతో ప్రదీప్ సెన్సేషన్ క్రియేట్ చేశాడు. దీంతో పాటు ప్రదీప్ నటించిన డ్రాగన్, డ్యూడ్ సినిమాలు కూడా వంద కోట్ల క్లబ్బులో అడుగు పెట్టి అతడికి యూత్‌లో మాంచి క్రేజ్ తెచ్చిపెట్టాయి. ఐతే ఈ టాలెంటెడ్ యాక్టర్ నటించిన కొత్త సినిమా 'ఎల్ఐకే' మాత్రం బాగా ఆలస్యం అయింది. అన్ని అడ్డంకులనూ అధిగమించి ఈ నెల 10న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తాజాగా ట్రైలర్ కూడా లాంచ్ చేశారు. ఐతే ఇప్పటిదాకా 'ఎల్ఐకే' నుంచి రిలీజ్ చేసిన ప్రోమోలేవీ అంత గొప్పగా అనిపించలేదు. ట్రైలర్ కూడా ఎగ్జైటింగ్‌గా లేదు. ఇంకో 15 ఏళ్ల తర్వాత జరిగే కథతో ఈ సినిమాను తీర్చిదిద్దారు. టెక్నాలజీ గొప్పదా.. మనిషి హృదయం గొప్పదా అనే పాయింట్ మీద ఈ సినిమాను నడిపించారు. ప్రదీప్ తీసిన 'లవ్ టుడే'కు ఇది ఎక్స్‌టెన్షన్‌లాగా అనిపించింది కానీ.. అందులో ఉన్న ఎంటర్టైన్మెంట్ ఇందులో ఉంటుందా అన్నది సందేహంగానే ఉంది. దర్శకుడు విఘ్నేష్ శివన్‌కు ఓవర్ రేటెడ్ డైరెక్టర్ అనే పేరుంది. 'నానుమ్ రౌడీ దా' చిత్రంతో అతను భలేగా ఎంటర్టైన్ చేశాడు. కానీ దాని కంటే ముందు, తర్వాత తీసిన సినిమాలన్నీ తుస్సుమన్నాయి. అతను వన్ ఫిలిం వండర్ అనే ముద్ర పడింది. 'ఎల్ఐకే' ట్రైలర్ మీద కూడా మిక్స్డ్ రెస్పాన్స్



వస్తోంది. ఈ సినిమా సక్సెస్ అయితే ఆశ్చర్యపోవాలనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఆలస్యం వల్ల కూడా సినిమా మీద నెగెటివ్ ముద్ర పడింది. ఈ నేపథ్యంలో ప్రదీప్ బ్లాక్ బస్టర్ స్ట్రీక్ కొనసాగడం సందేహంగానే ఉంది.



# బిజినెస్ న్యూస్



## పొద్దుతిరుగుడు పువ్వు నూనె విక్రయాలు 10% తగ్గొచ్చు

ముంబయి: పశ్చిమాసియా ఉద్రికత్తల పరిణామాల ఫలితంగా మన దేశంలో శుద్ధి చేసిన (రిఫైన్డ్) పొద్దుతిరుగుడు పువ్వు (సన్‌ఫ్లవర్) నూనె విక్రయాల పరిమాణం ఈ ఆర్థిక సంవత్సరం (2026-27)లో 10% తగ్గే అవకాశం ఉందని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. సరఫరా అంతరాయాలకు తోడు, పెరుగుతున్న ధరల నేపథ్యంలో, చౌకైన ప్రత్యామ్నాయ నూనెల వైపు వినియోగదార్లు మారుతుండటంతో.. గిరాకీ తగ్గి విక్రయాల పరిమాణం తగ్గుతుందని పేర్కొంది. సంస్థ నివేదిక ప్రకారం.. మనదేశంలో వార్షిక వంట నూనె వినియోగం 25-26 మిలియన్ టన్నులు కాగా, శుద్ధి చేసిన పొద్దుతిరుగుడు పువ్వు నూనె వాటా ఇందులో 12-14 శాతంగా ఉంది. మనదేశానికి రష్యా, ఉక్రెయిన్, అర్జెంటైనా నుంచి ఈ నూనె ఎక్కువగా దిగుమతి అవుతోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలకు ముందు, ఈ ముడినూనె 12 నెలల సగటు దిగుమతి ధర టన్నుకు 1,275 డాలర్లు కాగా ప్రస్తుతం 1,420-1,440 డాలర్లకు పెరిగింది. డాలర్‌తో పోలిస్తే బలహీనపడుతున్న రూపాయి, అధిక రవాణా ఖర్చులు మన



దేశంలో ముడి పొద్దుతిరుగుడు పువ్వు నూనె దిగుమతి వ్యయాన్ని మరింత పెంచుతున్నాయి. దీంతో నూనె ధరలు పెరిగాయి. దీంతో వినియోగదార్లు ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు. పొద్దుతిరుగుడు పువ్వు ముడి నూనె ధర పెరగడం వల్ల, శుద్ధి చేసిన పొద్దుతిరుగుడు పువ్వు నూనె చిల్లర ధరలు కూడా పెరిగాయి. 2026 జనవరిలో లీటరు రూ.150 ఉండగా, ప్రస్తుతం ఈ నూనె లీటరుకు రూ.170-175గా ఉంది. ప్రస్తుతం పొద్దుతిరుగుడు పువ్వు నూనెతో పోలిస్తే బియ్యపు తవుడు, సోయాబీన్ నూనెలు లీటరుకు రూ.10-20 తక్కువకే లభిస్తున్నందున, ఈ ప్రత్యామ్నాయాల వైపు కొందరు మొగ్గు చూపే అవకాశం కనిపిస్తోంది

## రూ.1.5 లక్షల కోట్లకు వీసీ పెట్టుబడులు



దిల్లీ: ప్రైవేట్ క్యాపిటల్ మార్కెట్లలో ప్రపంచవ్యాప్తంగా మందగమనం ఉన్నప్పటికీ, భారత్‌లో వెంచర్ క్యాపిటల్ (వీసీ) పెట్టుబడులు 2025లో 16 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.1.5 లక్షల కోట్ల)కు పెరిగాయి. ఇవి వరుసగా రెండో ఏడాదీ వృద్ధిని నమోదు చేశాయని అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ బైన్ అండ్ కంపెనీ వెల్లడించింది. బైన్ అండ్ కంపెనీ, ఇండియన్ వెంచర్ అండ్ ఆల్టర్నేట్ క్యాపిటల్ అసోసియేషన్ (ఐవీసీఏ) సంయుక్తంగా 'ఇండియా వెంచర్ క్యాపిటల్ రిపోర్ట్ 2026'ను విడుదల చేశాయి. దీని ప్రకారం మొత్తం లావాదేవీలు ఏడాది ప్రాతిపదికన 18% పెరిగాయి. వివిధ దశల్లో జరిగిన మొత్తం లావాదేవీల సంఖ్య 1300 దాటాయి. ప్రపంచవ్యాప్తంగా స్థూల ఆర్థిక సవాళ్లు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కఠినమైన నగదు లభ్యత పరిస్థితులు ఉన్నప్పటికీ ఈ వృద్ధి నమోదైంది. 50 మిలియన్ డాలర్ల కంటే తక్కువ విలువ కలిగిన లావాదేవీల్లో బలమైన వృద్ధి ఇందుకు దోహదపడింది. పెద్ద లావాదేవీలు కూడా వేగం పుంజుకున్నాయి. 250 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువ కలిగిన లావాదేవీల సంఖ్య నాలుగు నుంచి రెట్టింపై 8కి చేరింది. అనవసర విస్తరణ కంటే.. వ్యాపార నాణ్యత, లాభదాయకతకు ప్రాధాన్యత ఇచ్చే కంపెనీలకే పెట్టుబడిదారులు మొగ్గుచూపారు. కన్జ్యూమర్ టెక్ ఫండింగ్ కొంత తగ్గినా, 2023తో పోలిస్తే ఏడాది ప్రాతిపదికన 25% వృద్ధి దీర్ఘకాలిక స్థిరత్వం కనిపించింది. ఫిన్‌టెక్ రంగం అద్భుత పనితీరుతో పెట్టుబడుల రికవరీలో కీలక పాత్ర పోషించింది. ఫిన్‌టెక్ లావాదేవీల విలువ ఏడాది ప్రాతిపదికన 2.22 రెట్లు పెరిగాయి. విలువలో చెల్లింపుల విభాగం అతిపెద్ద వాటా కలిగి ఉండగా, డిజిటల్ వినియోగం పెరగడం వల్ల 'వెల్త్‌టెక్' విభాగంలో లావాదేవీల విలువ అయిదు రెట్లు అధికమైంది. సాఫ్ట్‌వేర్, సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్‌లలో పెట్టుబడులు 1.5 రెట్లు పెరిగాయి. బ్యాంకింగ్, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో కృత్రిమ మేధ (ఏఐ), జనరేటివ్ ఏఐ ఆధారిత బీ2బీ కంపెనీలు మంచి ఆదరణ దక్కించుకున్నాయి. 2023 తర్వాత భారత వీసీ వ్యవస్థ మళ్లీ వృద్ధి పథంలోకి వచ్చిందని, ఈ సారి స్పష్టమైన పరిణతి కనిపిస్తోందని బైన్ అండ్ కంపెనీ అసోసియేట్ పార్టనర్ ఆదిత్య మురళీధర్ తెలిపారు.

# మారియట్ వ్యూహంతో పీవీఆర్ ఐనాక్స్

ఉనికిని విస్తరించడమే లక్ష్యంగా పీవీఆర్ ఐనాక్స్ అడుగులు వేస్తోంది. ఇందుకోసం మారియట్ నమూనా వ్యూహాన్ని అనుసరించేందుకు సన్నాహాలు చేసుకుంటోంది. పెట్టుబడిదార్లు ప్రోపర్టీలకు నిధులు సమకూరిస్తే పీవీఆర్ ఐనాక్స్ కార్యకలాపాలను, సినిమాటిక్ అనుభవాన్ని నిర్వహిస్తుంది. ఇది ప్రపంచ వ్యాప్త హోటల్ చైన్‌ల విస్తరణ వ్యూహాలను పోలి ఉంది. ఈ కంపెనీ గ్వాలియర్, ఆగ్రాలలో ఈ నమూనాను ప్రయోగాత్మక ప్రాజెక్టుగా అమలు చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా విస్తరణ వ్యూహాల్లో, యాజమాన్యం లేకుండా విస్తరించడంలో ఆతిథ్య రంగం సాధించినంత నైపుణ్యం కొన్ని పరిశ్రమలకు మాత్రమే ఉంది. దశాబ్దాలుగా మారియట్ ఇంటర్నేషనల్, హయత్ హోటల్స్ కార్పొరేషన్, హిల్టన్ వరల్డ్‌వైడ్ వంటి సంస్థలు హోటళ్లను సొంతం చేసుకోవడం ద్వారా కాకుండా, వాటిని నిర్వహించడం ద్వారా తమ సామ్రాజ్యాలను నిర్మించుకున్నాయి. పెట్టుబడిదార్లు భవన నిర్మాణానికి నిధులు సమకూర్చగా, బ్రాండ్‌తో ఆయా సంస్థలు వినియోగదార్లకు మంచి అనుభవాన్ని అందిస్తున్నాయి. మనదేశంలో అతిపెద్ద మల్టీప్లెక్స్ చైన్ గత ఏడాదిగా ఈ వ్యూహాన్ని నిశ్శబ్దంగా రూపొందిస్తూ వస్తోంది. ఇప్పుడు టైర్-2, టైర్-3 నగరాల్లో వేగవంతమైన, దూకుడు విస్తరణ దశలోకి ప్రవేశిస్తోంది. పీవీఆర్ ఐనాక్స్ దేశంలో ఎగ్జిబిటర్ వ్యాపారంలో దశాబ్దాలుగా అత్యంత కీలకమైన మార్పునకు నాంది పలుకుతోంది. సినిమా అనుభవాన్ని అందించడంపై నియంత్రణను కాపాడుకుంటూనే, మన దేశంలో తక్కువ సేవలు పొందుతున్న మార్కెట్లలో వృద్ధిని సాధించే లక్ష్యంతో, ఫ్రాంచైజ్ ఓన్డ్, కంపెనీ ఆపరేటెడ్ (ఫోకో) నమూనాను అనుసరిస్తోంది. ఇప్పుడు దీన్ని మరింత విస్తరిస్తే పీవీఆర్ ఐనాక్స్ మారియట్ మూమెంట్ మంచి అవకాశాలను అందిస్తుంది. భాగస్వామి ప్రోపర్టీ, ఫిట్-అవుట్‌లపై పెట్టుబడి పెడతారు. పీవీఆర్ ఐనాక్స్ డిజైన్, టెక్నాలజీ, కార్యాచరణ నైపుణ్యాలు అందిస్తుంది. ఫీజు, రెవెన్యూ షేర్ పద్ధతిలో ఆదాయం సమకూర్చుకుంటుంది. ఇందులో సైన్-ఆన్ ఫీజు, డిజైన్ ఫీజు, టెక్నాలజీకి చెల్లింపులు వంటివి ఉంటాయి. ప్రోగ్రామింగ్, ప్రైసింగ్ స్ట్రాటెజీ, కస్టమర్ ఎక్స్‌పీరియన్స్, టెక్నాలజీ స్టాక్ వంటి వాటిపై పీవీఆర్ ఐనాక్స్‌కు నియంత్రణ ఉంటుంది. హోటల్ దిగ్గజాలు నిర్వహిస్తున్న మేనేజ్‌మెంట్ కాంట్రాక్ట్ నమూనాను ఇది పోలి ఉంటుంది. యజమాని క్యాపిటల్ సమకూర్చితే, బ్రాండ్ ప్రోపర్టీని నిర్వహిస్తుంది. ఇక్కడ కూడా ప్రోపర్టీని యజమాని అందిస్తే మిగతా టెక్నాలజీ, డిజైన్, కార్యకలాపాలు పీవీఆర్ ఐనాక్స్ తీసుకుని ఆదాయంలో వాటా తీసుకుంటుంది.



## తలసీమియా పిల్లల కోసం

# అల్లు అర్జున్ ఫ్యాన్స్ రక్తదానం




రక్త మార్పిడి అవసరమయ్యే చిన్నారుల కోసం ఎన్‌వీఎన్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అల్లు అర్జున్ అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. తమ అభిమాన హీరో

**విజయనగరం, ఏప్రిల్ 05 (నేటి మనదేశమ్) :** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని విజయనగరం జిల్లా అల్లు అర్జున్ ఫాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. తలసీమియా వ్యాధితో బాధపడుతూ ప్రతి 21 రోజులకు పుట్టినరోజును సేవా కార్యక్రమంతో జరుపుకోవడం ద్వారా సమాజానికి మంచి సందేశాన్ని అందించారు. యువత రక్తదానం తలసీమియా పిల్లల ప్రాణాలు కాపాడటానికి సహాయపడిందని నిర్వాహకులు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని వారు ఆకాంక్షించారు



## నూతన ఎస్ఐగా జ్ఞానప్రసాద్

**రామభద్రపురం, ఏప్రిల్ 05 (నేటి మనదేశమ్) :** స్థానిక పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐ గా జ్ఞానప్రసాద్ నియామకం అయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసినా కొద్ది నెలల్లోనే బొబ్బిలి ట్రాఫిక్ ఎస్ఐ గా బదిలీ అయ్యారు. మరలా సాధారణ బదిలీల్లో బాగంగా బొబ్బిలి ట్రాఫిక్ నుంచి లా అండ్ ఆర్డర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా వస్తున్నారు.

# స్మార్ట్ కిచెన్‌ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

### - ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ డిమాండ్



**విజయనగరం, ఏప్రిల్ 05 (నేటి మనదేశమ్) :** ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు అందించే మధ్యాహ్న భోజన పథకం స్థానంలో స్మార్ట్ కిచెన్‌లు ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికులు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎన్‌పిఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మధ్యాహ్న భోజనం నిర్వాహణను స్మార్ట్ కిచెన్లుకు ఇవ్వొద్దని, వేడివేడి భోజనాన్ని పిల్లలకు దూరం చెయ్యొద్దని, మధ్యాహ్న భోజన నిర్వాహకుల ఉపాధిని తీయొద్దని అన్నారు. వచ్చే ఏడాది నుంచి పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికుల స్థానంలో స్మార్ట్ కిచిన్‌ల ద్వారా పిల్లలకు భోజనాలు పంపించాలని నిర్ణయించడం అన్యాయమని అన్నారు. దీనివల్ల జిల్లాలో ఉన్న 4వేల మంది కార్మికుల ఉపాధి పోతుందన్నారు. గత 25ఏళ్లగా బిల్లులు రాకపోయినా, జీతాలు రాకపోయినా, అప్పులు చేసి పుస్తెలతాళ్లు తాకట్టు పెట్టి పిల్లలకు వేడివేడి భోజనం పెట్టారన్నారు. నేడు ప్రభుత్వం స్మార్ట్ కిచెన్ల పేరుతో ప్రైవేటీకరణ చేసేందుకు నిర్ణయించడం అన్యాయమన్నారు. గతంలో జిల్లాలో నెల్లిమర్ల ప్రాంతం నవప్రయాస్‌కు ఇవ్వడానికి ప్రయత్నం చేశారని, సిఐటియు, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన పోరాటం చేయడంతో ప్రభుత్వం దిగివచ్చి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుందన్నారు. స్మార్ట్ కిచెన్‌ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే పెద్ద ఎత్తున పిల్లల తల్లిదండ్రులు, ప్రజలు, ప్రజా సంఘాలతో పెద్దఎత్తున పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పిల్లలకు మెనూ ఛార్జి 20 రూపాయలు పెంచాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. విలేకర్ల సమావేశంలో యూనియన్ అధ్యక్షురాలు మంగళలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మి, సీత, దేవి పాల్గొన్నారు.

# రూ.10 బాదంమిల్క్.. ఎంతపని చేసిందీ?



**శ్రీకాకుళం, ఏప్రిల్ 05 (నేటి మనదేశమ్) :** శ్రీకాకుళం నగరంలో ఇటీవలే డయేరియా ప్రబలి ఎంతోమంది ఆసుపత్రిపాలయ్యారు. ఒకరు చనిపోయారు కూడా. ఈ వ్యవహారంలో ఒక అధికారిపై వేటు కూడా పడింది. సీఎం చంద్రబాబు కూడా దీనిపై సీరియస్ అయ్యారు. ఈ ఘటన మరువకముందే శ్రీకాకుళం మండలంలోని సింగుపురం గ్రామంలో బాదంమిల్క్ తాగి 80 మంది దాకా అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగుపురంలో రెండు రోజుల క్రితం గ్రామదేవత జాతర వైభవంగా జరిగింది. మామిడివలస ప్రజలు కూడా జాతరకు వచ్చారు. కొందరు వ్యాపారులు బండ్లపై బాదం పాలు విక్రయించారు. మొదట గ్లాసు రూ.30కి అమ్మిన వారు.. ఆతర్వాత ధరను రూ. 10కి తగ్గించేశారు. తక్కువ ధరకు వస్తుండటంతో చాలామంది తాగారు. వీరందరికీ గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఆరోగ్య పరిస్థితి విషమించింది. తీవ్ర జ్వరం, ఆపై వాంతులు, విరోచనాలు మొదలయ్యాయి.

**క్లినిక్‌లకు పోటెత్తిన రోగులు..**

అస్వస్థతకు గురైన వారు హుటాహుటిన సింగుపురంలోని నాలుగు ఆర్ఎంపీ క్లినిక్‌లకు వెళ్లారు. కొన్ని గంటల వ్యవధిలోనే ఒక్కో క్లినిక్‌కు 20 మందికి పైగా క్యూ కట్టారు. ఫ్లూయిడ్స్ ఎక్కించుకుని, అక్కడ ఉండలేక ఇళ్లకు వెళ్లి చికిత్స తీసు కున్నారు. మామిడి వలసలోనూ ఇవే లక్షణాలతో 15 మంది ప్రైవేటు క్లినిక్‌లకు వెళ్లారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెంటనే స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ క్లినిక్‌లను మూసివేయించి, బాధితులను సింగుపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. శుక్రవారం ఉదయం ఆరుగురు, రాత్రి మరో పదిమంది పీహెచసీలో చికిత్స పొందారు. మామిడివలసలో నలుగురికి డీహైడ్రేషన్ అయి పరిస్థితి విషమించడంతో వారిని శ్రీకాకుళం లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సింగుపురం పీహెచ్‌సీకి వెళ్లారు. అదనపు వైద్యులు, సిబ్బందిని రప్పించారు. కలెక్టర్ రోగులను పరామర్శించారు.

**మంత్రి అచ్చెన్నాయుడు ఆరా**

మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం రాత్రి కలెక్టర్‌కు ఫోన్‌చేసి మాట్లాడారు. ఫుడ్‌పాయిజన్ వల్లనే ఇలా జరిగిందని.. పరిస్థితి అదుపులోనే ఉందని కలెక్టర్ మంత్రికి వివరించారు. 'ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉంది. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించాం' అని మంత్రి తెలిపారు.

# విజయనగరం ఆర్‌డిఒగా సుధాసాగర్



**విజయనగరం, ఏప్రిల్ 05 (నేటి మనదేశమ్) :** విజయనగరం రెవెన్యూ డివిజనల్ అధికారిగా సనపల సుధా సాగర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం హెచ్‌పిసిఎల్ లో పని చేస్తూ బదిలీపై ఇటీవల విజయనగరానికి వచ్చారు. ఇంతవరకు ఇంచార్జ్ ఆర్‌డిఒగా ఉన్న డి.వెంకటేశ్వర రావు నుంచి సుధా సాగర్ ఛార్జి తీసుకున్నారు.

# గిరిజన గ్రామాల్లో భారీ వర్షం



**కురుపాం, ఏప్రిల్ 05 (నేటి మనదేశమ్) :** మండలంలోని మొండెంఖల్, గుజ్జువాయి, జి.శివడ, నీలకంఠాపురం తదితర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన వర్షంతో గ్రామాల్లో రహదారులపై నీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం మొదలైన వెంటనే పొలాల్లో ఉన్న రైతులు, కూలీలు పనులు నిలిపివేసి సమీప ప్రాంతాల్లో ఆశ్రయం పొందేందుకు పరుగులు తీశారు. కొన్ని తక్కువ ఎత్తైన ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరాలో కూడా కొంతసేపు అంతరాయం కలిగినట్లు గ్రామస్తులు తెలిపారు. అయితే ఈ వర్షం పంటలకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఉపాధి చట్టాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలి



**కొమరాడ, ఏప్రిల్ 05 (నేటి మనదేశమ్) :** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగిం చాలని, వి బి జి రామ్ చట్టాన్ని రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి సాంబమూర్తి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఉపాధి పనులు పాత పద్ధతులో జరగాలని, పేస్ యాప్ రద్దు చేయాలని, పని చేసే ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఉపాధి కూలీలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ వామపక్షాల మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వం 2006లో ప్రారంభించిన ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీలంతా పని కల్పించడం లేదన్నారు. కొంతమందికి పని ఇస్తున్నారని, కొంతమందికి పని కల్పించడం లేదని గ్రామాల్లో 10 గ్రూపులుంటే ఐదు గ్రూపులకు వారం రోజుల పాటు మిగతా ఐదు గ్రూపులకు మరో వారం రోజులు పాటు పని కల్పించే పరిస్థితి ఉందన్నారు. గ్రామాల్లో ఉపాధి కూలీలందరికీ పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలను తీవ్రవాదుల్లా పేస్ యాప్ పెట్టి పని ఇచ్చినట్లే ఇచ్చి ఎగ్గొట్టే పరిస్థితి ఉంద న్నారు. దీనివల్ల ఉపాధి కూలీలకు పని లేకుండా పోతుందని, రోజూ పనిచేసే చోటకు వెళ్లి ముఖ ఆధారిత హాజరును వేయడం, హాజరు పడకపోతే పని లేకుండా కొంతమంది పనిచేస్తే మరి కొంతమంది తిరిగి ఇంటికి వెళ్లిపోవడం జరుగుతుందని తెలిపారు. దీంతో మండలంలో వందలామంది కూలీలు ఉపాధి హామీ పని లేకుండా పోతుందన్నారు. పేస్ యాప్ రద్దు చేయాలని, అలాగే కనీసం కూలి రాని పరిస్థితుల్లో వేతనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మూడు నాలుగు వారాలు చొప్పున పని చేసిన నేటికీ కూలి డబ్బులు అందలేదని, వెంటనే కూలి డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక్క పూట మాత్రమే పని కల్పించాలని మౌలిక సదుపాయాలు కల్పించాలని, అలాగే రోజు కూలి రూ.600, ఏడాదికి 200 రోజులు పని కల్పించి పాత పద్ధతుల్లోనే ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# సిబ్బంది కొరత నివారణకు చర్యలు : కలెక్టర్



**ఏలేశ్వరం, ఏప్రిల్ 05 (నేటి మనదేశమ్) :** ఏలేరు రిజర్వాయర్ కార్యాలయ సిబ్బంది కొరతను అధిగమించేందుకు ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎంఎస్.హరేంధిర ప్రసాద్ చెప్పారు. కలెక్టర్ శుక్రవారం ఏలేరు రిజర్వా యర్, మణి హంస పవర్ ప్లాంట్లను సందర్శించారు. రిజర్వాయర్ కెపాసిటీ, రైతులకు, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నీటి విడుదల వివరాలను అధికారులను అడిగి తెలుసు కున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిర్వహణకు సిబ్బంది కొరత ఉందని ఈ విషయాన్ని ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లి సిబ్బందిని నియామకానికి కృషి చేస్తానన్నారు. రిజర్వాయర్ గేట్లు విషయమై ఇస్కో అధికారులతో చర్చించి సంబంధిత కాంట్రాక్టర్లకు నోటీసు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో...

ఏలేరు ఇఇ వెంకటేశ్వర్లు, డిఇ శ్యామ్‌ప్రసాద్, సిబ్బంది మణిహంస పవర్ ప్లాంట్ మేనేజర్ వి.ప్రసాద్ బాబు, తహశీల్దారు కుశరాజు, ఎస్ఐ ఎన్.రామలింగేశ్వరరావు, రిజర్వాయర్ సిబ్బంది ఉన్నారు.

# పారిశ్రామిక అభివృద్ధి వేగవంతం

### రాష్ట్ర పారిశ్రామిక వాణిజ్య శాఖ ప్రధాన కార్యదర్శి యువరాజ్



**రామభద్రపురం(విజయనగరం), ఏప్రిల్ 05 (నేటి మనదేశమ్) :** విజయనగరం జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాష్ట్ర ఇండిస్ట్రీస్ అండ్ కామర్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ యువరాజ్, కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్ కలిసి రామభద్రపురం మండ లం కొట్టక్కి గ్రామంలో ఉన్న ఎపిఐఐసి భూము లను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ యువరాజ్ మాట్లాడుతూ, జిల్లాలో పారి శ్రామిక అభివృద్ధికి అనుకూలంగా భూముల వినియోగంపై సమగ్రంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశిం చారు. ప్రధాన రహదారి నుండి ఎపిఐఐసి భూములకు అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి ఉన్న అవకాశాలను కూడా పరిశీలించాలని సూచిం చారు. అదేవిధంగా... గుర్ల మండలంలో ప్రతి పాదిత సూపర్ స్మెల్టర్, డెంకాడ, భోగాపురం మండలాల్లో ఐటి హబ్‌కు సంబం ధించిన ల్యాండ్ పార్సెల్ అంశా లను కూడా పరిశీలిం చారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి కోసం పక్క జిల్లాలతో సమన్వ యం చేసుకుని ముందుకు సాగాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల ఆర్డీవోలు, సంబంధిత మండల తహశీల్దార్లు, ఎపిఐఐసి అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వార్డుల విభజన ప్రారంభం

- నర్సీపట్నంలో సర్వే చేస్తున్న అధికారులు
- 9వ తేదీతో ప్రక్రియ పూర్తి.. ముసాయిదా తయారీ
- 10 నుంచి 16వ తేదీ వరకు ప్రజల నుంచి సూచనలు, అభ్యంతరాల స్వీకరణ
- పరిశీలన అనంతరం కలెక్టర్ ద్వారా సీడీఎంఏకు నివేదిక
- మే మొదటి వారంలో తుది నోటిఫికేషన్ విడుదల



**నర్సీపట్నం, ఏప్రిల్ 05 (నేటి మనదేశమ్) :** మునిసిపాలిటీలో వార్డుల పునర్విభజన ప్రక్రియ మొదలైంది. ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం జనాభా, భౌగోళిక విస్తీర్ణం పరిగణన లోకి తీసుకొని పునర్విభజన చేయాల్సి ఉంది. ప్రస్తుతం పురపాలక సంఘం పరిధిలో 28 వార్డులు ఉన్నాయి. 2011 జనాభా లెక్కలు ప్రకారం నర్సీపట్నం మునిసిపాలిటీ జనాభా 61,540. వార్డుల పునర్విభజకు ప్రభుత్వం విడుదల చేసిన జీవో 64లో మునిసిపాలిటీ జనాభా 60 వేల నుంచి 80 వేల మధ్యలో ఉంటే 40 వార్డులు వుండాలి. దీంతో నర్సీపట్నం జనాభా 60 వేలు దాటి వున్నందున వార్డుల సంఖ్య 28 నుంచి 40కి పెరుగుతుంది. ఈ మేరకు వార్డుల పునర్విభజనపై సర్వే చేసి ముసాయిదాని సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. శుక్రవారం కమిషనర్ సురేంద్ర, పట్టణ ప్రణాళిక అధికారి సత్యనారాయణ కలిసి సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. వార్డుల పునర్విభజనను పూర్తి చేసిన తరువాత ముసాయిదా తయారు చేసి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేస్తారు.

**ప్రభుత్వ మార్గదర్శకాలు**

మునిసిపల్ అధికారులు ఈ నెల 9వ తేదీ లోగా వార్డుల ముసాయిదా (డ్రాఫ్ట్) తయారు చేయాలి. అదే రోజున ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేయాలి. 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ప్రజల నుంచి అభ్యం తరాలు, సూచనలు స్వీకరిస్తారు. 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ప్రజల నుంచి వచ్చిన అభ్యం తరాలు, సూచనలను పరిశీలిస్తారు. అనంతరం వార్డుల విభజన ప్రతిపాదనను జిల్లా కలెక్టర్‌కు పంపుతారు. కలెక్టర్ పరిశీలించి మునిసిపల్ పరిపాలన శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ (సీడీఎంఏ)కి నివేదిస్తారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, కలెక్టర్ నివేదికను పరిగణనలోకి తీసుకొని సీడీఎంఏ నివేదికను ప్రభుత్వానికి పంపుతుంది. ప్రభుత్వం ఆమోదముద్ర వేసి మే మొదటి వారంలో తుది నోటిఫికేషన్ జారీ అవుతుంది.

**ఆశా వాహుల్లో ఆనందం**

మునిసిపాలిటీలో వార్డుల సంఖ్య ఒకేసారి 28 నుంచి 40కి పెరగనుండడంతో మునిసిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్న పలువురు ఆశావాహుల్లో ఆనందం వ్యక్తం అవుతున్నది. గత ఎన్నికల్లో వివిధ రకాల రిజర్వేషన్ల వల్ల కౌన్సిలర్‌గా పోటీ చేయడానికి అవకాశం లభించని వారు.. ఈసారి పోటీకి ఛాన్స్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# అక్రమంగా గోవులు తరలిస్తున్న వాహనం పట్టివేత

**నర్సీపట్నం, ఏప్రిల్ 05 (నేటి మనదేశమ్) :** శ్రీకాకుళం నుంచి విశాఖ నగరంలోకి తొమ్మిది గోవులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పీఎం పాలెం పోలీసులు అడ్డుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున కారు షెడ్డు కూడలి వద్ద తనిఖీలు చేపడుతుండగా ఈ వాహనం పట్టుబడింది. గోవులను ఎక్కడికి తరలిస్తున్నారన్న దానిపై డ్రైవర్ పొంతన లేని సమాధానం చెప్పడంతో.. పోలీసులు వాహనాన్ని, గోవులను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.



# టమాటా రైతు గుండె కోత..

కావూరులో కోత ఖర్చులు రాక చేలోనే పంటార్పణం!"



**నరసరావుపేట ఏప్రిల్ 05 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నరసరావుపేట చిలకలూరిపేట మండలం కావూరు గ్రామ టమాటా రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారు. ఆరుగాలం శ్రమించి, వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన పంటకు మార్కెట్‌లో కనీస ధర లభించకపోవడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. కనీసం కోత కూలీలు, రవాణా ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో, పంటను మార్కెట్‌కు తీసుకెళ్లేకంటే పొలంలోనే వదిలేయడం మేలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ఎకరాల కొద్దీ టమాటా పంట చేలోనే కుళ్ళిపోతూ పశువుల పాలవుతోంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి మద్దతు ధర కల్పించాలని, నష్టపోయిన తమను ఆదుకోవాలని కావూరు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# సైకిల్ పై కలెక్టరేట్ లో విధులకు హాజరైన జిల్లా కలెక్టర్

**మచిలీపట్నం ఏప్రిల్ 05 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** శబ్ద



కాలుష్యం,వాయు కాలుష్యం నివారణలో భాగంగా ప్రతి శనివారం ఉద్యోగులందరూ నడక లేదా సైకిల్ పై రావాలని పిలుపునిచ్చిన జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ లో విధులకు సైకిల్ పై వచ్చిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

# నగరంలో రెచ్చిపోతున్న దొంగలు.!



**మచిలీపట్నం ఏప్రిల్ 05 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నగరంలో ఈ మధ్య దొంగతనాల జోరు పెరిగింది. తాజాగా మచిలీపట్నం సర్కార్ తోట రామాలయం వీధిలో చోరీ జరిగింది. ముఖ్యంగా తాళం వేసిన ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. పామర్తి వెంకట జయలక్ష్మి నివాసంలో చోరీ జరిగింది. జయలక్ష్మి విజయవాడకు వెళ్ళిన సమయంలో దొంగలు ఆమె ఇంట్లో చోరీ చేయడం విశేషం. పోలీసు వారు కూడా ఏదైనా ఊరు వెళ్తే సమీప పోలీస్ స్టేషన్లో వివరాలు తెలియజేయండి అని నగర ప్రజలకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు. జయలక్ష్మి ఇంట్లో 40 వేల రూపాయల నగదు రెండు బంగారు గాజులు, ఉంగరం, లక్ష్మీదేవి రూపులు దొంగలు చోరీ చేసినట్లుగా తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాత్రి వేళల్లో పోలీస్ నిఘా కరువైంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో పోలీసు గస్తీ అత్యంత ఆవశ్యకం అని నగర ప్రజలు భావిస్తున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సహాయంతో దొంగల్ని అతి త్వరలో పట్టుకుంటామని బందరు డిఎస్పి ధర్మేంద్ర తెలిపారు. యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వీధి కమిటీలు ఏర్పాటు చేసుకొని దొంగల నిరోధానికి నగర పౌరులు సహకరించాలని అన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**పార్వతీపురం ఏప్రిల్ 05 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** బడుగు



బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. దేశం కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నత కోసం ఆయన చేసిన కృషి త్యాగాలు మరువలేనివని మంత్రి అన్నారు. ప్రతిక్షణం పేద ప్రజల కోసం ఆలోచించేసి వారు ఆర్థికంగా పైకి రావాలన్న ఆలోచనతో ఆయన చేసిన ప్రయత్నాలు ఎంతో మంచి ఫలితాలను ఇచ్చాయని మంత్రి అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయ్, చంద్ర కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి, తెదేపా అరకు పార్లమెంటు అధ్యక్షుడు తేజోవతి, భాజపా జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# సద్గుణాలు కలిగిన మహోన్నత వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్

## -జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



**మచిలీపట్నం ఏప్రిల్ 05 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు పోలీసు అధికారులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ నేటి తరాల వారికి ఆదర్శప్రాయుడని, సామాజిక న్యాయం కోసం నిస్వార్థ పోరాటాలకు, అనగారిన వర్గాల వారి సమానత్వం కోసం కృషి చేసి, విద్యార్థి దశలోనే అంటరానితనం అనే సాంఘిక దురాచారాలను పటాపంచలు చేసిన మహోన్నతుడని, తన తండ్రి నుండి మానవతావాదం, ఆదర్శవాదం, స్థితిస్థాపకత అనే సద్గుణాలను అలవర్చుకొని,అనగారిన, వివక్షకు గురైన వారి న్యాయం కోసం అనేక పోరాటాలు, ప్రదర్శనలు చేసి ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఆనాటి కాలంలోనే అంటరానితనం యొక్క పౌల్ ఆచారాన్ని నిర్మూలించేందుకు మహాత్మా గాంధీ తో కలిసి అనేక పోరాటాలలో తాను కూడా పాల్గొన్నారని, అంతేకాక స్వాతంత్ర పోరాటంలో క్విట్ ఇండియా ఉద్యమం, శాసనోల్లంఘన ఉద్యమాలలో సైతం గాంధీ తో కలిసి తాను కూడా అడుగులు వేశారని, కనుక అటువంటి గొప్ప నాయకుడు, స్వాతంత్ర సమరయోధుడుని స్మరించు కోవడం మనందరికీ గర్వకారణం అని అన్నారు.

# బాబు జగజ్జివన్ రామ్ కి నివాళులర్పించిన "గోపు".!



**మచిలీపట్నం ఏప్రిల్ 05 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నగరంలో మల్కాపట్నం 19 వ వార్డు లో కృష్ణాజిల్లా తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ 118వ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ బాబు జగ్జీవనరావు భారత స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయవాది, ప్రముఖ దళిత నాయకుడన్నారు. 1947లో నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వంలో అతి పిన్న వయస్కుడైన మంత్రిగా పనిచేశారు. 30 ఏళ్లకు పైగా కేంద్ర మంత్రిగా కార్మిక, ఆహార, రక్షణ శాఖల వంటి కీలక పదవులు సమర్థవంతంగా నిర్వహించిన నాయకుడన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వం జాతీయ నాయకులకు ఘనమైన నివాళులు అర్పించడం ఆనందంగా ఉందన్నారు. చరిత్రలో ఎవరు చేయలేని విధముగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు గోపు అభిమానులు పాల్గొనారు.

# నందిగామ జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా...

## సమానత్వం కోసం మహానుభావుల సేవలు చిరస్మరణీయం: ఎమ్మెల్యే సౌమ్య...



**నందిగామ ఏప్రిల్ 05 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో ఆదివారం బాబూ జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సౌమ్య పాల్గొని భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బీఆర్ అంబేద్కర్, స్వాతంత్ర్య సమరయోధుడు బాబూ జగజ్జీవన్ రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఈ మహానుభావులు చేసిన కృషి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి, సమాజంలో సమాన హక్కుల సాధనకు వారు చేసిన సేవలు ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. వారి ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా సమాజంలో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. బాబూ జగజ్జీవన్ రామ్ దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని, ముఖ్యంగా సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. డాక్టర్ అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో వెనుకబడిన వర్గాలకు న్యాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు, కూటమి పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని మహానుభావులకు నివాళులు అర్పించారు. కార్యక్రమం సాదాసీదాగా కాకుండా గౌరవప్రదంగా, శ్రద్ధాభక్తులతో నిర్వహించబడింది.

# మచిలీపట్నం అర్బన్ బ్యాంక్ అభివృద్ధిలో రాజ్ కుమార్ పాత్ర కీలకం... పలువురు వక్తలు




**మచిలీపట్నం ఏప్రిల్ 05 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మచిలీపట్నం కోపరేటివ్ అర్బన్ బ్యాంక్లో 28 సంవత్సరాలు సేవలందించిన ఏలిశెట్టి రాజకుమార్ పదవీ విరమణ వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. బ్యాంక్ అధ్యక్షులు ఇమడా బత్తుల దిలీప్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు అధికారులు రాజకీయ నాయకులు పాల్గొని రాజకుమార్ సేవలను కొనియాడారు. పదవికే ఉన్ని తెచ్చే విధంగా అర్బన్ బ్యాంక్ సీఈఓ గా అర్బన్ బ్యాంకులో ఎందరో పేదలకు సహాయ సహకారాలు అందించి బ్యాంకుకి గుర్తింపు తీసుకొచ్చిన రాజ్ కుమార్ సేవలు బ్యాంక్ చరిత్రలో నిలిచిపోతాయని వక్తలు అన్నారు. రాజకీయ పార్టీలు మారిన కార్యవర్గం మారిన తనదైన శైలి లో రాజకుమార్ బ్యాంక్ కార్యకలాపాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విధి నిర్వహణ చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె నాని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు బాలాజీ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంతం వెంకట గజేంద్ర రావు అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు బొర్రా విటల్ కే డి సి సి బ్యాంక్ మాజీ డైరెక్టర్ అంబటి కాంతారావు జిల్లాస్థాయి సొసైటీ అధికారులు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్లు పాల్గొన్నారు. తొలుత రాజకుమార్ పద్మావతి దంపతులు కుటుంబ సభ్యులతో కేక్ కట్ చేశారు. రాజ్ కుమార్ ను పలువు రు శాలువాలతో పూలమాలతో ఘనంగా సన్మానించారు

# పూర్ణ వందేమాతరం గీతం ఆలాపన కార్యక్రమం




**మచిలీపట్నం ఏప్రిల్ 05 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** భారత జాతీయ గేయం వందేమాతరం గీతాన్ని రచించి 150 సంవత్సరములు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో పూర్ణ వందేమాతర గీతాలాపన కార్యక్రమాన్ని భారత్ వికాస్ పరిషత్ ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రారంభించారు. స్థానిక ఇనుగుదురుపేట నాగార్జున పబ్లిక్ స్కూల్ నందు ఉదయం 8 గంటలకు భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షులు ప్రసాద్ ప్రారంభ సందేశాన్ని ఇస్తూ 1870 సంవత్సరంలో బంకిమ్ చంద్ర ఛటర్జీ బెంగాలీ సంస్కృతంలో రచించిన భారత జాతీయ గీతం మొదటిగా ఆనంద్ మఠం నవలలో ప్రచురించబడినది. స్వాతంత్రోద్యమంలో దేశభక్తిని రగిలించింది వందేమాతరం, జనవరి 24 1950వ సంవత్సరం భారత రాజ్యాంగ సభ దీనిని జాతీయగీతం గా ఆమోదించటం తెలిపిందని తెలియజేసినారు. ఈ సందర్భంగా ఏపీ ప్రైవేట్ స్కూలు అసోసియేషన్ మచిలీపట్నం డివిజన్ అధ్యక్షులు ఎం వెంకట నరసయ్య వందేమాతరం మీద నినాదాలు చేసినారు ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ కౌన్సిల్ చైర్మన్ మాజీ అధ్యక్షులు వి సుందర రావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఎంతో విలువైనదని ప్రతి విద్యార్థికి పూర్ణ వందేమాతరం వచ్చే విధంగా కృషి చేయాలని ఈ గీతాలాపన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు సంఘ సభ్యులను అభినందిస్తూ పూర్ణ వందేమాతర గీతాలాపన ప్రారంభించ వలసిందిగా కోరారు. చిన్నారి గాయని కుమారి కోమలి భ్రమరాంబిక పూర్ణ వందేమాతర గీతాన్ని ఆలపించగా విద్యార్థులందరూ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ ఫైనాన్స్ సెక్రటరీ వివి రమణ, సంయుక్త కార్యదర్శి ఐ.వి.వి కుమార్,ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు స్వామి, కార్యదర్శి కవిత, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు ఆవోపా ఉపాధ్యక్షులు పులవర్తి శ్రీనివాస్. వివిధ విద్యాసంస్థల అధినేతలు పాల్గొన్నారు.

# సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అన్నదాన పథకానికి రూ.1,00,111 విరాళం



**మోపిదేవి ఏప్రిల్ 05 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కృష్ణా జిల్లా మోపిదేవిలో వెలసిన శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయానికి రూ.1,00,111 విరాళం అందింది. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నిత్య అన్నదాన పథకానికి గుంటూరు జిల్లా తాడేపల్లి గ్రామానికి చెందిన సుసర్ల వెంకట శశికృష్ణ రాఘవ, జయనందిని అన్నదానం నిమిత్తం రూ.1,00,111 విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ అధికారులు సత్కరించారు. స్వామివారి ప్రసాదం అందించారు.

# బాబూ జగజ్జీవన్ రామ్ జయంతి

## : ఎస్పీ అద్నాన్ నయీం అస్మి నివాళులు



**భీమవరం ఏప్రిల్ 05 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పశ్చిమ గోదావరి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, ఐపీఎస్, మహనీయుని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఘన నివాళులు అర్పించారు. బాబూ జగజ్జీవన్ రామ్ భారత దేశ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమని, ఆయన అలుపెరగని పోరాట యోధుడిగా, అణగారిన వర్గాల గొంతుకగా నిలిచారని ఎస్పీ కొనియాడారు.

# ఎమ్మెల్యే గంటా చేతులమీదుగా.. రూ. 1.13 కోట్ల విలువైన వైద్య ఉపకరణాల అందజేత



**ఆనందపురం ఏప్రిల్ 05 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రోటరీ గ్లోబల్ గ్రాంట్ నుంచి మంజూరైన రూ. 1.13 కోట్లు విలువైన వివిధ వైద్య ఉపకరణాలను గంభీరంలో ఉన్న ఏజ్ కేర్ ఫౌండేషన్‌కు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. అ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా రోటరీ సేవలు ఆదర్శనీయం అని అన్నారు. వివిధ అనారోగ్యాల కారణంగా మంచాన పడిన వారికి స్వస్థత చేకూర్చే ఆసుపత్రిగా ఏజ్ కేర్ ఫౌండేషన్ దేశంలోనే ప్రత్యేకత సంతరించుకుందన్నారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఈ ఆసుపత్రి ప్రారంభోత్సవం చేయడానికి ప్రయత్నిస్తానన్నారు. రోటరీ గ్లోబల్ నిధులతో సమకూర్చిన ఫిజియోథెరపీ, డయాగ్నోస్టిక్, నర్సింగ్ విభాగాలకు చెందిన వైద్య పరికరాలతో పాటు కమర్షియల్ వాషింగ్, వంటశాల పరికరాలను ఫౌండేషన్‌కు అందజేశారు. పూర్వపు డిస్ట్రిక్ట్ గవర్నర్ సీహెచ్. కిషోర్ కుమార్ (రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ) చొరవతో వివిధ దేశాల రోటరీ క్లబ్‌లు, రోటరీ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ నిధులను సమకూర్చినట్లు రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ ప్రెసిడెంట్ చింతా నేతాజీ తెలిపారు.

# జగ్జీవన్ స్ఫూర్తితోనే సాగుతోన్న కూటమి ప్రభుత్వ పాలన: మంత్రి కందుల దుర్గేష్



**నిడదవోలు ఏప్రిల్ 05 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** దళిత వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడు జగ్జీవన్ రామ్ అని.. ఆయన స్ఫూర్తితోనే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా ఆదివారం నిడదవోలు మండలం కంసాలిపాలెంలో బాబూజీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఉద్యమకారుడిగా, కేంద్ర మంత్రిగా ఆయన చేసిన సేవలు అజరామరమని కొనియాడారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని కంసాలి పాలెం గ్రామ అభివృద్ధికి మంత్రి కందుల దుర్గేష్ పలు హామీలు ఇచ్చారు. దళితవర్గాల కోసం 3, 4 నెలల్లో కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని అన్నారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే కార్యాచరణ సిద్ధమైందన్నారు. యువత కోసం త్వరలోనే ఆట స్థలాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో దళిత, బలహీన వర్గాల సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.) and Printed at SKYLINE PRESS, D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.), Associate Editor : K. Neeraja, Ph: 0866-2411299. E-mail: netimanadesam.vja@gmail.com